www.flashindianews.com

FLASH INDIA NEWS
ప్రతిక్షణం.. ప్రజలకోసం...

# ఫ్లాష్ ఇండియా

తెలుగు దినపత్రిక

FLASH INDIA TELUGU DAILY

RNI NO.APTEL/2010/33229



విలేకరులు కావలెను

18 సం॥ లుగా వెలువడుతున్న "ఫ్లాష్ ఇండియా" తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు,నియోజకవర్గాల, మరియు మండలాల వారీగా విలేకరులు కావలెను..

సెల్ నెంబర్: 9951494039



సంపుటి : 17 | సంచిక : 140 | ఆదివారం 05.07.2026 | ఎడిటర్ : కొమరాజు శ్రీనివాసులు | పేజీలు : 08 | వెల రూ : 2/-


# ప్రధాని మోడీ కీలక వ్యాఖ్యలు

## గ్యాస్ సిలిండర్ ధర రూ. 2 వేలు దాటాల్సి ఉండే కానీ..

- దేశీయ రిఫైనరీల సామర్థ్యంతో ఎల్పీజీ ఉత్పత్తికి ఊతం
- 35 వేల నుంచి 54 వేల మెట్రిక్ టన్నులకు పెరిగిన ఎల్పీజీ ఉత్పత్తి
- రూ.2,000 దాటాల్సిన సిలిండర్ ధరను రూ.950లోపే నిలిపాం: మోదీ

02



### ఎల్పీజీ ధరల నియంత్రణలో కేంద్ర వ్యూహం ఫలితం

### 'ఆత్మనిర్భర భారత్' ఫలితమే ఇంధన భద్రత

యుద్ధం కారణంగా డీజిల్, పెట్రోల్ ధరలపై తీవ్రమైన ప్రభావం పడిందని, అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు బ్యారెల్‌కు 70 డాలర్ల నుండి ఒక్కసారిగా 120 డాలర్లకు పెరిగాయాని చెప్పారు. దిగుమతి మార్గాలు కూడా మూసుకుపోయా-యన్నారు.

# జూలై 20 నుంచి వర్షాకాల సమావేశాలు..

## ఎజెండాలో వన్ నేషన్-వన్ ఎలక్షన్

- స్పీకర్ ఓం బిర్లా నిర్ణయంపై అందరి దృష్టి
- వర్షాకాల సమావేశాల్లో కీలక బిల్లుల ప్రవేశం
- మహిళా రిజర్వేషన్ బిల్లుకు కేంద్రం ప్రాధాన్యం
- మంత్రులు, సీఎంల అనర్హతపై రాజ్యాంగ సవరణ బిల్లు
- జులై 20 నుంచి ఆగస్టు 13 వరకు పార్లమెంట్ సమావేశాలు
- నాలుగు వారాల్లో మొత్తం 19 సిట్టింగ్స్
- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి సమావేశాలకు ఆమోదం
- జాతీయ ప్రాధాన్యత అంశాలపై విస్తృత చర్చలు
- సభ బలాబలాల్లో మార్పులకు అవకాశం

03

### దేశ రాజకీయాలకు దిశానిర్దేశం చేసే సమావేశాలు

### స్పీకర్ ఓం బిర్లా నిర్ణయంపై అందరి దృష్టి



నా రాజకీయ జీవితానికి మిడ్జిల్ పునాది

ప్రజల నమ్మకమే నా రాజకీయ బలం

# కేసీఆర్‌కు ఉరేసినా తప్పులేదు..



2006 జూలై 4 నా జీవితంలో చారిత్రాత్మక రోజు

## మిడ్జిల్ నాటిన మొక్క.. నేడు మహా వృక్షమైంది

- 20 ఏళ్ల రాజకీయ ప్రస్థానాన్ని గుర్తుచేసుకున్న సీఎం రేవంత్
- మిడ్జిల్‌ను దత్తత తీసుకోవాలని భట్టికి సీఎం ఆదేశం
- డార్క్ మండలం నుంచి అభివృద్ధి మండలంగా మారుస్తాం
- 20 ఏళ్లలో ఒక్కరోజూ సెలవు తీసుకోలేదు
- ప్రజా సమస్యల పరిష్కారమే నా లక్ష్యం
- బీసీ జనగణనతో శతాబ్ద సమస్యకు పరిష్కారం
- వర్గీకరణ సమస్యను పరిష్కరించామని రేవంత్ వ్యాఖ్య
- గ్రామీణ సమస్యలే రాష్ట్ర సమస్యలు
- పాలమూరు బిడ్డలు పరిపాలనకు పనికిరారా?

### నా వల్ల ఎవరికీ కష్టం నష్టం రావొద్దనేదే నా ఆలోచన

### రబ్బానీకి ప్రభుత్వంలో బాధ్యత ఇస్తాం

**మిడ్జిల్,ఫ్లాష్ ఇండియా :**
2006 జులై 4న మిడ్జిల్ మండల ప్రజలు జడ్పీటీసీగా తనను ఆశీర్వదించారని ఆనాడు మిడ్జిల్ ప్రజలు నాటిన మొక్క ఇవాళ పెద్ద వృక్షమైందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తన రాజకీయ ప్రస్థానంలో కీలకమైన మిడ్జిల్ ప్రజలకు రేవంత్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. తన రాజకీయ ప్రస్థానం 20 ఏళ్లు పూర్తైన సందర్భంగా నాగర్ కర్నూల్ జిల్లా మిడ్జిల్‌లో ఏర్పాటు చేసిన కృతజ్ఞత సభలో పాల్గొని మాట్లాడారు. జడ్పీటీసీగా సువర్ణాక్షరాలతో ఒక చరిత్రను లిఖించిన రోజు 2006 జులై 4 అని గుర్తుచేశారు. ఆరోజు అది నా గెలుపు కాదని.. అది మిడ్జిల్ ప్రజల గెలుపు అన్నారు. జడ్పీటీసీగా స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన నన్ను మిడ్జిల్ ప్రజలు అక్కున చేర్చుకున్నారని నాది ఈ నియోజకవర్గం కాకపోయినా ఇక్కడి ప్రజలు నమ్మకంతో గెలిపించారన్నారు. ఆనాడు మీరు తీసుకున్న నిర్ణయం చాలా గొప్పదన్నారు. ఉరుములు ఉరిమినా, పిడుగులు పడ్డా నన్ను కలిసేందుకు వచ్చారు. ఉరుములు ఉరిమినా, పిడుగులు పడ్డా నన్ను కలిసేందుకు వచ్చారన్నారు.



# రైతులు నష్టపోవద్దు..

### ప్రత్యామ్నాయ పంటలకు సిద్ధం కావాలి

- ప్రత్యామ్నాయ పంట ప్రణాళికలు సిద్ధం చేయాలి
- రైతులకు నష్టం లేకుండా జిల్లా వారీగా కార్యాచరణ
- తక్కువ వర్షాలకు ముందస్తు ప్రణాళికలు రూపొందించాలన్న సీఎస్
- ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలి
- నాణ్యమైన విత్తనాలు, ఎరువుల సరఫరాపై నిరంతర పర్యవేక్షణ
- వర్షాభావ పరిస్థితులపై కలెక్టర్లకు సీఎస్ కీలక ఆదేశాలు
- వర్షాభావ పరిస్థితులపై కలెక్టర్లకు సీఎస్ కీలక ఆదేశాలు

03


### అనువైన స్థలాలను గుర్తించండి

## బాడీ బిల్డింగ్, సిక్స్ ప్యాక్‌పై మోజుతో

# జిమ్‌కు వెళ్తున్నారా?

- జిమ్‌లను అడ్డాగా చేసుకుని స్టెరాయిడ్ దందా..
- త్వరగా కండలు పెరుగుతాయంటూ యువతను మోసం చేసిన ముఠా
- ప్రాణాంతక స్టెరాయిడ్ ఇంజెక్షన్ల అక్రమ విక్రయాల గుట్టురట్టు
- హైదరాబాద్‌లో స్టెరాయిడ్ మాఫియాపై టాస్క్‌ఫోర్స్ కొరడా
- బాడీ బిల్డింగ్ మోజుతో యువతను టార్గెట్ చేసిన నిందితులు
- వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా హార్మోన్ ఇంజెక్షన్ల విక్రయం

05




# కొత్త పేర్లు ఇచ్చేది లేదు..

## టీఆర్ఎస్.. కుదరదు! వేరే పేరు మార్చుకోండి

- కవిత కొత్త పార్టీకి ఈసీ బ్రేక్.. పేరుపై వెయ్యికిపైగా అభ్యంతరాలు
- 'తెలంగాణ రక్షణ సేన' పేరుకు ఎన్నికల సంఘం షాక్
- ప్రత్యామ్నాయంగా మూడు పేర్లు ఇవ్వాలని కవితకు ఈసీ ఆదేశం
- 15 రోజుల్లో కొత్త పేర్లు ఇవ్వకపోతే దరఖాస్తు మూసివేత హెచ్చరిక

03




### పార్టీ పేరుపై వెనక్కి తగ్గేది లేదు

తెలంగాణ రాజకీయాల్లో కల్వకుంట్ల కవిత కొత్త పార్టీ అంశంలో ట్విస్టుల మీద ట్విస్టులు నమోదు అవుతున్నాయి. 'తెలంగాణ రక్షణ సేన ' పేరుతో ప్రజల్లోకి వెళ్తోన్న కవితకు కేంద్ర ఎన్నికల సంఘం తాజాగా బిగ్ షాక్ ఇచ్చింది. తన పార్టీ పేరును 'తెలంగాణ రక్షణ సేన' గా నామకరణం చేస్తూ రిజిస్ట్రేషన్ కోసం కవిత ఈసీకి దరఖాస్తు చేసుకోగా ఈ పేరుపై సుమారు వెయ్యికి పైగా అభ్యంతరాలు వచ్చాయని అందువల్ల మూడు ప్రత్యామ్నాయ పేర్లను తమకు సర్పించాలని ఈసీ తాజాగా కవితకు లేఖ రాసింది. ప్రత్యామ్నాయ పేర్లు 15 రోజుల్లోగా తమకు పంపకపోతే పార్టీ నమోదు దరఖాస్తును ఎలాంటి తదుపరి సమాచారం ఇవ్వకుండా మూసివేస్తామని...






# కల్తీ ఆహారంపై హెచ్-ఫాస్ట్ ఉక్కుపాదం..

### 100 రోజుల్లో 185 కేసులు.. 121 టన్నుల కల్తీ ఆహారం స్వాధీనం

- హైదరాబాద్‌లో కల్తీ ఆహార మాఫియాపై హెచ్-ఫాస్ట్ ఉక్కుపాదం
- ప్రజల ఆరోగ్యంతో చెలగాటం.. కల్తీ వ్యాపారులపై కఠిన చర్యలు
- అల్లం-వెల్లుల్లి పేస్ట్ నుంచి పన్నీర్ వరకు భారీ కల్తీ బహిర్గతం
- 60 టన్నుల చికెన్ వ్యర్థాలు సీజ్.. ఆహార భద్రతపై అలర్ట్
- కృత్రిమంగా పండించిన 25 టన్నుల పండ్లు స్వాధీనం
- ప్రమాదకర రసాయనాలతో పన్నీర్ తయారీ.. అధికారుల ఆందోళన

02

# పైరసీపై కేంద్రం సీరియస్..




- పైరసీపై కేంద్రం కొరడా.. టెలిగ్రామ్‌కు నోటీసులు
- 15 రోజుల్లో పైరసీ కంటెంట్ తొలగించాలంటూ టెలిగ్రామ్‌కు ఆదేశం
- 3,142 పైరసీ ఛానళ్లపై కేంద్రం సీరియస్
- సినిమాలు, వెబ్‌సిరీస్‌ల పైరసీకి చెక్.. కేంద్రం కీలక చర్యలు
- కాపీరైట్ ఉల్లంఘనలపై టెలిగ్రామ్‌కు హెచ్చరిక
- పైరసీ ఛానళ్లను వెంటనే తొలగించాలి

02

# కల్తీ ఆహారంపై హెచ్-ఫాస్ట్ ఉక్కుపాదం..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** హైదరాబాద్ నగరంలో ఆహార కల్తీపై పోలీసులు కఠిన చర్యలు చేపడుతున్నారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న కల్తీ మాఫియాపై ఉక్కుపాదం మోపేందుకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హెచ్-ఫాస్ట్ విభాగం గత 100 రోజుల్లోనే భారీ స్థాయిలో తనిఖీలు నిర్వహించి 185 కేసులు నమోదు చేసింది. ఈ దాడుల్లో మొత్తం 121 టన్నుల కల్తీ ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. నగరంలో పెరుగుతున్న ఆహార కల్తీ ఘటనలను అరికట్టేందుకు పోలీస్ శాఖ ప్రత్యేకంగా హెచ్-ఫాస్ట్ విభాగాన్ని ఏర్పాటు చేసింది. జీహెచ్ఎంసీ ఫుడ్ సేఫ్టీ అధికారులతో కలిసి ఈ విభాగం హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీలు, ఆహార తయారీ కేంద్రాలపై విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తోంది. ఈ క్రమంలో భారీ స్థాయిలో కల్తీ ఆహార పదార్థాలు వెలుగులోకి వచ్చాయి. అధికారుల వివరాల ప్రకారం.. 27 వేల కిలోల కల్తీ అల్లం-వెల్లుల్లి పేస్ట్, 25 వేల కిలోల కృత్రిమంగా పండించిన పండ్లను స్వాధీనం చేసుకున్నారు. అలాగే 60 టన్నులకు పైగా చికెన్ వ్యర్థాలను పట్టుకున్నారు. మరో 9 వేల కిలోల నిల్వ పచ్చళ్లను కూడా సీజ్ చేశారు. టీ పొడి, కోవా, క్రీమ్, నెయ్యి, పన్నీర్, పెరుగు వంటి అనేక ఆహార పదార్థాల్లో కల్తీ జరుగుతున్నట్లు తనిఖీల్లో బయటపడింది. ముఖ్యంగా పన్నీర్ తయారీలో ప్రమాదకర రసాయనాలు ఉపయోగిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ప్రజల ఆరోగ్యానికి హానికరమైన పదార్థాలతో ఆహార ఉత్పత్తులు తయారు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీల్లో అనేక హోటళ్లు, రెస్టారెంట్లలో అపరిశుభ్ర పరిస్థితులు కూడా వెలుగులోకి వచ్చినట్లు తెలిపారు. ప్రాంతాల వారీగా చూస్తే రాజేంద్రనగర్ జోన్ లోనే అత్యధికంగా 55 కేసులు నమోదయ్యాయి. ఈ ప్రాంతంలో ఆహార తయారీ యూనిట్లు, ఫ్యాక్టరీలు అధిక సంఖ్యలో ఉండటంతో కల్తీ కార్యకలాపాలు ఎక్కువగా గుర్తించినట్లు అధికారులు తెలిపారు. ఇప్పటివరకు నమోదైన కేసులతో పాటు మరో 247 కేసులను జీహెచ్ఎంసీ ఫుడ్ సేఫ్టీ విభాగానికి బదిలీ చేశారు. హోటళ్లు, బేకరీలు తప్పనిసరిగా ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్ కలిగి ఉండాలని, పరిశుభ్రత ప్రమాణాలు పాటించాలని ఆదేశాలు జారీ చేశారు. కల్తీ ఆహార వ్యాపారులపై అవసరమైతే పీడీ యాక్ట్ కింద కూడా కేసులు నమోదు చేస్తామని పోలీసులు స్పష్టం చేశారు. భవిష్యత్తులో హెచ్-ఫాస్ట్ విభాగాన్ని మరింత బలోపేతం చేసి తనిఖీలను విస్తరించనున్నట్లు తెలిపారు. స్టార్ హోటళ్ల నుంచి చిన్న రెస్టారెంట్ల వరకు, ఆహార తయారీ కేంద్రాల నుంచి నిల్వ గోదాముల వరకు విస్తృత తనిఖీలు కొనసాగుతాయని అధికారులు వెల్లడించారు. ప్రజలకు నాణ్యమైన, సురక్షితమైన ఆహారం అందించడమే లక్ష్యంగా ఈ చర్యలు చేపడుతున్నామని, కల్తీకి పాల్పడే వారిపై ఎలాంటి ఉపేక్ష ఉండదని అధికారులు హెచ్చరించారు.



# ఇప్పుడు డీజిల్ వంతు..

**న్యూ ఢిల్లీ :** దేశంలో శిలాజ ఇంజనాల దిగుమతులు తగ్గించడమే లక్ష్యంగా కేంద్రం బయోఫ్యూయల్ విప్లవం వైపు వేగంగా అడుగులు వేస్తోంది. ఇప్పటికే E20 పెట్రోల్ ను తీసుకొచ్చిన కేంద్రం డీజిల్ లో 15 శాతం ఐసోబ్యూటనాల్ మిశ్రమాన్ని కలిపేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్లు కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖమంత్రి నితిన్ గడ్కరీ వెల్లడించారు. సాంప్రదాయమైన జీవ ఇంధనాలతో పోలిస్తే.. ఐసోబ్యూటనాల్ ఎక్కువ ఇంధన సామర్థ్యాన్ని ఇస్తుందని, ప్రస్తుతం డీజిల్ ఇంజన్లకు ఇది సరిగ్గా సరిపోతుందని తెలిపారు. అలాగే తక్కువ కాలుష్య ఉద్గారాలను విడుదల చేస్తుందని స్పష్టం చేశారు. అందుకే దీనిని నెక్స్ట్ జనరేషన్ బయోఫ్యూయల్ గా పరిగణిస్తున్నామన్నారు. భారతదేశ ప్రత్యామ్నాయ ఇంధన రోడ్ మ్యాప్ గురించి నితిన్ గడ్కరీ మాట్లాడుతూ.. పెట్రోల్ లో మాదిరిగా.. డీజిల్ లో ఇథనాల్ నేరుగా కలపడం సాధ్యం కాదని తెలిపారు. ఈ సమస్యకు పరిష్కారంగా ఇథనాల్ ను ఐసోబ్యూటనాల్ గా మార్చే సాంకేతికతపై కసరత్తు జరుగుతోందని, ఇది డీజిల్ కు అత్యంత సమర్థవంతమైన ప్రత్యామ్నాయంగా మారుతుందని పేర్కొన్నారు. డీజిల్ కు ఐసోబ్యూటనాల్ సరైన ప్రత్యామ్నాయమని, ఇప్పటికే నిర్వహించిన పైలట్ ప్రాజెక్టుల్లో ఇది అద్భుతమైన ఫలితాలను ఇచ్చిందన్నారు. రానున్న రోజుల్లో పెద్దఎత్తున దీనిని అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు.

# ప్రధాని మోడీ కీలక వ్యాఖ్యలు

## గ్యాస్ సిలిండర్ ధర రూ. 2 వేలు దాటాల్సి ఉండే కానీ..

**రాజస్థాన్ :** ఆత్మ నిర్భరతతోనే దేశ అభివృద్ధి సాధ్యం అవుతుందని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. పశ్చిమాసియా యుద్ధం కారణంగా తలెత్తిన చమురు, వంటగ్యాస్ సంక్షోభాన్ని భారతదేశం సమర్థవంతంగా ఎదుర్కొందని మోడీ వివరించారు. 21వ శతాబ్దపు నవ భారత్ యొక్క సంకల్ప బలం, దౌత్య వ్యూహాల వల్లే దేశం ఈ ముప్పు నుంచి సురక్షితంగా బయటపడిందని స్పష్టం చేశారు. ఇవాళ రాజస్థాన్ పర్యటలో భాగంగా ఓ బహిరంగ సభలో మాట్లాడిన మోడీ.. యుద్ధం కారణంగా డీజిల్, పెట్రోల్ ధరలపై తీవ్రమైన ప్రభావం పడిందని, అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు బ్యారెల్‌కు 70 డాలర్ల నుండి ఒక్కసారిగా 120 డాలర్లకు పెరిగాయాని చెప్పారు. దిగుమతి మార్గాలు కూడా మూసుకుపోయాయన్నారు. ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలలో డీజిల్, పెట్రోల్ ధరలు 40 శాతం నుండి 50 శాతం వరకు పెరిగితే మరి కొన్ని దేశాలైతే ఇంధన సరఫరాపై రేషనింగ్ కూడా విధించాయన్నారు. కానీ భారతదేశం ఒక్క రోజు కూడా అలాంటి కొరతను గానీ, పరిస్థితిని గానీ ఎదుర్కోలేదని చెప్పారు.

**90 శాతం హార్ముజ్ నుంచే:**

భారత దేశం తన ఎల్పీజీ అవసరాలలో సుమారు 60 శాతం దిగుమతుల ద్వారానే తీర్చుకుంటోందని ఆ సరఫరాలో 90 శాతం గల్ఫ్ దేశాల నుండే (హార్ముజ్ జలసంధి) ద్వారా వచ్చేదేనన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో అకస్మాత్తుగా తలెత్తిన యుద్ధం ఏర్పడటంతో మన దేశంపై ఎలాంటి భారీ సంక్షోభం ముంచుకొచ్చిందో మీరు ఊహించుకోవచ్చన్నారు. కానీ ఈ సంక్షోభం ప్రారంభం కాగానే, మేము మన దేశీయ రిఫైనరీల సామర్థ్యాన్ని ఉపయోగించుకోవడంపై దృష్టి పెట్టామని, దేశీయ ఎల్పీజీ ఉత్పత్తి 35,000 మెట్రిక్ టన్నుల నుండి 54,000 మెట్రిక్ టన్నులకు పెరిగిందన్నారు.

**రూ. 2000 దాటాల్సిన సిలిండర్.. రూ. 950 లోపే!**

వంటగ్యాస్ డిమాండ్ భారం మొత్తం కేవలం ఎల్పీజీ పైనే పడకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకుందని మోడీ చెప్పారు. పీఎన్జీ (పీఎన్జీ - పైప్డ్ నేచురల్ గ్యాస్) కనెక్షన్లను విస్తరించడానికి ఒక పెద్ద ప్రచారాన్ని ప్రారంభించినట్లు వివరించారు. చాలా తక్కువ సమయంలోనే భారతదేశంలో 11 లక్షల (1.1 మిలియన్) కంటే ఎక్కువ గృహాలకు పీఎన్జీ కనెక్షన్లను అందించామని అప్పటి అంతర్జాతీయ పరిస్థితులను బట్టి చూస్తే, దేశీయ గ్యాస్ సిలిండర్ ధర రూ. 2,000 కు పెరిగి ఉండేదని ప్రముఖ మార్కెట్ నిపుణులు కూడా అంచనా వేశారు.

అయినప్పటికీ, ఇప్పటికీ దేశీయ ఎల్పీజీ సిలిండర్ రూ. 950 కంటే తక్కువ ధరకే అందించబడుతోందన్నారు. కొన్ని శక్తులు బహిరంగంగా పుకార్లు, భయాలను వ్యాప్తి చేయడానికి ప్రయత్నించినా మేము పరిస్థితిని హ్యాండిల్ చేసిన విధానం, కఠోర శ్రమ, సహనం మరియు విధానపరమైన, దౌత్యపరమైన స్థాయిలలో తీసుకున్న ప్రతి సున్నితమైన చర్య భవిష్యత్తులో చరిత్రలో నిలిచిపోతాయన్నారు.

# 5,000 పోలీసు పోస్టుల భర్తీకి గ్రీన్‌సిగ్నల్!

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణలో పోలీసు ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువతకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. రాష్ట్ర పోలీసు శాఖలో వివిధ కేటగిరీలలో ఖాళీగా ఉన్న 5,000 పోస్టులను భర్తీ చేయడానికి ప్రభుత్వం అధికారికంగా అనుమతి ఇచ్చింది. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం.. పోలీసు శాఖలో ఉన్న ఖాళీలను సమీక్షించిన అనంతరం శాఖ అవసరాలు, సిబ్బంది కొరత, ఆర్థిక భారం వంటి అంశాలను పరిశీలించి ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ నియామకాలను తెలంగాణ స్టేట్ లెవల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు (టీఎస్ఎల్‌పీఆర్‌బీ) ద్వారా నిర్వహించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ నియామక ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని ప్రభుత్వం టీఎస్ఎల్‌పీఆర్‌బీని ఆదేశించింది. స్థానిక కేడర్ల వారీగా ఖాళీలు, రోస్టర్ పాయింట్లు, విద్యార్హతలు, రిజర్వేషన్లకు సంబంధించిన పూర్తి వివరాలను హోం శాఖ, డీజీపీ కార్యాలయం రిక్రూట్‌మెంట్ బోర్డుకు వెంటనే అందజేయాలని సూచించింది. అన్ని వివరాలు అందిన వెంటనే టీఎస్ఎల్‌పీఆర్‌బీ అధికారిక నోటిఫికేషన్ విడుదల చేసి.. నియామక షెడ్యూల్‌ను ప్రకటించనుంది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా పోలీసు ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న వేలాది మంది అభ్యర్థులకు త్వరలోనే దరఖాస్తు చేసుకునే అవకాశం లభించనుంది. ఈ భారీ నియామక ప్రక్రియతో తెలంగాణ పోలీసు శాఖలో సిబ్బంది కొరత కొంత మేర తీరనుండగా.. రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగావకాశాలు లభించనున్నాయి. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పోలీసు నియామకాల కోసం ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న అభ్యర్థుల్లో కొత్త ఆశలను నింపింది. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఇది నాలుగో నోటిఫికేషన్. 2015 చివరలో 9281 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ కాగా.. 2018లో 1217 మంది ఎస్సై పోస్టులు, 16285 మంది కానిస్టేబుళ్ల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ అయింది. 2022లో 554 ఎస్సై పోస్టులతో పాటు 15644 కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ వచ్చింది. తాజాగా 5 వేల పోస్టుల భర్తీకి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.

**5 వేల పోస్టుల భర్తీ ఇలా:**

సబ్-ఇన్‌స్పెక్టర్ (సివిల్) -- 148 పోస్టులు
సబ్-ఇన్‌స్పెక్టర్ (ఏఆర్) -- 14 పోస్టులు
రిజర్వ్ సబ్-ఇన్‌స్పెక్టర్ (టీజీఎస్‌పీ) -- 12 పోస్టులు
సబ్-ఇన్‌స్పెక్టర్ (ఎస్ఏఆర్ సీపీఎల్) -- 5 పోస్టులు
అసిస్టెంట్ సబ్-ఇన్‌స్పెక్టర్ (ఎఫ్‌పీబీ) -- 3 పోస్టులు
పోలీస్ కానిస్టేబుల్ (సివిల్) -- 3,697 పోస్టులు
పోలీస్ కానిస్టేబుల్ (ఏఆర్) -- 1,052 పోస్టులు
పోలీస్ కానిస్టేబుల్ (ఎస్ఏఆర్ సీపీఎల్) -- 24 పోస్టులు
పోలీస్ కానిస్టేబుల్ (డ్రైవర్) -- 20 పోస్టులు
పోలీస్ కానిస్టేబుల్ (మెకానిక్) -- 25 పోస్టులు

# పైరసీపై కేంద్రం సీరియస్..

**న్యూ ఢిల్లీ :** సినిమాలు, వెబ్‌సిరీస్‌లు, ఇతర కాపీరైట్ కంటెంట్ పైరసీని అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో ప్రముఖ మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ టెలిగ్రామ్ కు కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ నోటీసు జారీ చేసింది. పైరసీ కంటెంట్‌ను వెంటనే తొలగించి, తీసుకున్న చర్యలపై 15 రోజుల్లోగా "యాక్షన్ టేకెన్ రిపోర్ట్" సమర్పించాలని ఆదేశించింది. భారత క్రియేటర్ ఎకానమీ, సినీ పరిశ్రమ, టెలివిజన్ ప్రసార సంస్థలు, ఓటీటీ వేదికలు, నిర్మాతలు, పంపిణీదారుల ప్రయోజనాలను కాపాడేందుకు ఈ చర్యలు చేపట్టినట్లు కేంద్రం పేర్కొంది. పైరసీకి పాల్పడుతున్న ఛానళ్లు, గ్రూపులు, బాట్లు, ఖాతాలు, అడ్మినిస్ట్రేటర్లు, అనుబంధ సంస్థలపై కూడా టెలిగ్రామ్ కఠిన చర్యలు తీసుకోవాలని సూచించింది. ఈ మధ్యకాలంలో పలు ఓటీటీ సంస్థలు, కంటెంట్ యజమానులు కేంద్రానికి ఫిర్యాదులు చేశారు. తమ కాపీరైట్ కలిగిన సినిమాలు, వెబ్‌సిరీస్‌లు టెలిగ్రామ్‌లో అనుమతి లేకుండా విస్తృతంగా షేర్ అవుతున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఫిర్యాదులను పరిశీలించిన కేంద్రం మొత్తం 3,142 టెలిగ్రామ్ ఛానళ్లు పైరసీ కంటెంట్‌ను పంపిణీ చేస్తున్నట్లు గుర్తించింది. దీనితో సమాచార సాంకేతిక చట్టం-2000 కింద టెలిగ్రామ్‌కు నోటీసులు జారీ చేశారు. కాపీరైట్ ఉల్లంఘనలకు సంబంధించిన కంటెంట్‌ను తొలగించడంతో పాటు.. మధ్యవర్తి సంస్థగా తన బాధ్యతలను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని కేంద్రం స్పష్టం చేసింది. సమాచార సాంకేతిక (ఇంటర్మీడియరీ గైడ్‌లైన్స్ అండ్ డిజిటల్ మీడియా ఎథిక్స్ కోడ్) నిబంధనలు-2021 ప్రకారం, ప్రభుత్వం లేదా కోర్టు నుంచి ఆదేశాలు వచ్చినప్పుడు అక్రమ కంటెంట్‌ను తొలగించడం ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లకు తప్పనిసరి. ఈ నిబంధనలను టెలిగ్రామ్ కచ్చితంగా అమలు చేయాలని కేంద్రం తెలిపింది. అలాగే.. ప్రతి పైరసీ ఛానల్‌ను ప్రభుత్వం ప్రత్యేకంగా గుర్తించి చెప్పే వరకు వేచి ఉండకూడదని కూడా కేంద్రం హెచ్చరించింది. టెలిగ్రామ్ స్వయంగా పర్యవేక్షణ చేపట్టి, పైరసీ కార్యకలాపాలను అరికట్టేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ఉందని పేర్కొంది. గత కొంతకాలంగా టెలిగ్రామ్‌పై భారత్‌లో పలు వివాదాలు తలెత్తుతున్నాయి. మోసాలు, వ్యక్తుల పేర్లతో నకిలీ ఖాతాల నిర్వహణ, సున్నితమైన సమాచార ప్రసారం వంటి అంశాలపై ఇప్పటికే కేంద్రం నిఘా పెంచింది. ముఖ్యంగా నీట్ పరీక్ష ప్రశ్నాపత్రాల లీకేజీ, తప్పుడు సమాచారం వ్యాప్తి వంటి ఆరోపణల నేపథ్యంలో టెలిగ్రామ్ సేవలపై గతంలో కేంద్రం తాత్కాలికంగా నిషేధం కూడా విధించింది. ఇప్పుడు పైరసీ అంశంపై కేంద్రం తీసుకున్న తాజా చర్యతో డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల బాధ్యతపై ప్రభుత్వం మరింత కఠినంగా వ్యవహరిస్తోందని స్పష్టంగా కనపడుతుంది.



# ఆరో ఎకరా రైతులకూ నిధులు విడుదల

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్రంలోని రైతులకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం శనివారం మరో అద్భుతమైన శుభవార్త అందించింది. వానాకాలం సాగు పెట్టుబడుల కోసం రైతులు ఎదురుచూస్తున్న తరుణంలో, ఐదో విడత రైతు భరోసా నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. ఇందులో భాగంగా ఆరు ఎకరాల వరకు సాగు భూమి కలిగిన రైతుల బ్యాంక్ ఖాతాల్లో ఎకరానికి రూ.6 వేల చొప్పున పెట్టుబడి సాయాన్ని నేరుగా జమ చేసింది. శనివారం ఒక్కరోజే దాదాపు 1.69 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.7135 కోట్లను ప్రభుత్వం జమ చేయడం విశేషం. కాగా, ఈ ఏడాది జూన్ 30 నుంచి ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా విడతల వారీగా ఈ నిధులను రైతుల ఖాతాలకు బదిలీ చేస్తోంది. నిధుల విడుదలలో భాగంగా.. తొలి రోజు రెండు ఎకరాల వరకు సాగు భూమి ఉన్న చిన్న, సన్నకారు రైతులకు పెట్టుబడి సాయాన్ని అందించారు. ఆ తర్వాత వరుసగా మూడు ఎకరాలు, నాలుగు ఎకరాల భూమి ఉన్న రైతులకు నిధులు వేయగా.. నిన్న (శుక్రవారం) ఐదు ఎకరాల వరకు భూమి ఉన్న రైతులకు సాయాన్ని అందించారు. తాజాగా శనివారం నాడు ఐదో విడత కింద ఆరు ఎకరాల లోపు భూమి ఉన్న రైతులకు కూడా నిధులు విడుదల కావడంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# అభివృద్ధి కార్యాక్రమాల్లో వేగం పెంచాలి



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** క్యూర్ పరిధిలో అర్బన్ హౌసింగ్ కు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖలకు ఆధునిక శాశ్వత భవనాలు ప్రభుత్వ ప్రాధాన్యతల అమలులో అధికారులు సమన్వయంతో పనిచేయాలి అధికార యంత్రాంగానికి మంత్రి పొంగులేటి దిశానిర్దేశం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలలో వేగం పెంచాలని , ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా పనిచేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. క్యూర్ పరిధిలో అఫర్డబుల్ ఎల్ఐజి అర్బన్ హౌసింగ్ స్కీమ్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాల నిర్మాణంపై శనివారం నాడు సచివాలయంలోని తన కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రిగారు మాట్లాడుతూ "గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి ఆలోచనలకు అనుగుణంగా పేదల సొంతింటి కలను నెరవేర్చాలన్న సంకల్పంతో గ్రామీణ ప్రాంతాలలో చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం విజయవంతమైంది. ఇది దేశానికే ఆదర్శంగా నిలిచింది. ఇదే స్ఫూర్తిని క్యూర్ పరిధిలో చేపట్టబోయే అఫర్డబుల్ ఎల్ఐజి అర్బన్ హౌసింగ్ పై కూడా చూపించాలి. క్యూర్ పరిధిలో పేదల జీవనోపాధికి ఇబ్బంది లేకుండా నియోజకవర్గాన్ని యూనిట్‌గా తీసుకొని పేదలు ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతాలకు సమీపంలో ఇండ్లు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వ ఆలోచనల మేరకు రెవెన్యూ , హౌసింగ్ విభాగాల అధికారులు సమిష్టిగా సమన్వయంతో పనిచేయాలి. వీలైనంత త్వరితగతిన పేదలకు ఇళ్లు అందించే విధంగా స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ఇప్పటికే ఖరారైన స్థలాలలో పొజిషన్ తీసుకొని ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన కార్యాచరణను వేగవంతంగా రూపొందించాలి. ఇంకా కొన్ని నియోజకవర్గాలలో స్థలాలను గుర్తించి తక్షణమే ఖరారు చేయాలి. క్యూర్ పరిధిలోని 26 నియోజకవర్గాలకు గాను ప్రతి నియోజకవర్గంలో తొలి విడతలో 500 ఇళ్లు నిర్మిస్తున్నాం. ఈ ఇళ్లకు సంబంధించి టెండర్లను వీలైనంత త్వరలో ఖరారు చేస్తాం. రాష్ట్ర వ్యాప్తంగా పది ఆర్డీవో, 107 తహశీల్దార్, స్టాంప్స్ & రిజిస్ట్రేషన్‌కు సంబంధించి రెండు డిఐజి , నాలుగు జిల్లా సబ్ రిజిస్ట్రార్, 52 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాలు నిర్మిస్తున్నాం. ఈ భవనాలన్నీ ఒకే డిజైన్‌లో ఉంటాయి. ఈ భవనాలన్నీ ఒకే నమూనాలో, ఆధునిక సదుపాయాలతో, ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేలా నిర్మిస్తున్నాం. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని విద్యుత్ ఆదా, పర్యావరణ పరిరక్షణ లక్ష్యాలతో సోలార్ పార్కింగ్ సదుపాయాలు కల్పిస్తాం" అని మంత్రి పొంగులేటి తెలిపారు. ఈ సమావేశంలో హౌసింగ్ కార్యదర్శి వి.పి. గౌతమ్, స్టాంప్స్ & రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

# మా విధానం అదే.. వెనక్కి తగ్గం



**ఆంధ్రప్రదేశ్ :** తాము మావిగన్నే కట్టుబడి ఉన్నామని వైసీపీ ఎమ్మెల్సీ, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ స్పష్టం చేశారు. అమరావతి రాజధాని విషయంలో ఆయన మనుపటి నిర్ణయానికే మద్దతు పలికారు. అమరావతిలో అవినీతి జరుగుతోందని బొత్స ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు దాటిందని, ఒక్క అభివృద్ధి కార్యక్రమాన్ని కూడా చేపట్టలేదని ఆరోపించారు. లక్షల కోట్లు అప్పు తెచ్చుస్తున్నారని, ఏ పథకానికి ఖర్చు పెడుతున్నారని ప్రశ్నిస్తే చెప్పడంలేదని మండిపడ్డారు. జగన్ ప్రభుత్వంలో చేసిన శంకుస్థాపలనే మళ్లీ చేపడుతున్నారని ఎద్దేవా చేశారు. రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే అవన్నీ సీఎం చంద్రబాబునాయుడికి పట్టడం లేదని బొత్స విమర్శించారు.

ఫ్లాష్ ఇండియా దినపత్రిక బుక్ చేసుకోవాలి అనుకుంటున్నారా లేదా మీ వ్యాపార ప్రకటనల కోసం మమ్మల్ని సంప్రదించండి 7730032999 flashindiadaily@gmail.com

# కొత్త పేర్లు ఇచ్చేది లేదు..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ రాజకీయాల్లో కల్వకుంట్ల కవిత కొత్త పార్టీ అంశంలో ట్విస్టుల మీద ట్విస్టులు నమోదు అవుతున్నాయి. 'తెలంగాణ రక్షణ సేన' పేరుతో ప్రజల్లోకి వెళ్తోన్న కవితకు కేంద్ర ఎన్నికల సంఘం తాజాగా బిగ్ షాక్ ఇచ్చింది. తన పార్టీ పేరును 'తెలంగాణ రక్షణ సేన' గా నామకరణం చేస్తూ రిజిస్ట్రేషన్ కోసం కవిత ఈసీకి దరఖాస్తు చేసుకోగా ఈ పేరుపై సుమారు వెయ్యికి పైగా అభ్యంతరాలు వచ్చాయని అందువల్ల మూడు ప్రత్యామ్నాయ పేర్లను తమకు సర్పించాలని ఈసీ తాజాగా కవితకు లేఖ రాసింది. ప్రత్యామ్నాయ పేర్లు 15 రోజుల్లోగా తమకు పంపకపోతే పార్టీ నమోదు దరఖాస్తును ఎలాంటి తదుపరి సమాచారం ఇవ్వకుండా మూసివేస్తామని హెచ్చరించింది. ఈ మేరకు జూన్ 23న కవితకు సీఈసీ పోస్టు ద్వారా లేఖను పంపించినట్లు సమాచారం.

**న్యాయపోరాటం చేస్తాం: కవిత**

ఈసీ నుంచి వచ్చిన 2 అభ్యంతరాలకు కల్వకుంట్ల కవిత స్పందిస్తూ సమాధానం ఇచ్చారు. అయితే ఈసీ కోరినట్లు ప్రత్యామ్నాయంగా కొత్త పేర్లు ఇచ్చే ప్రసక్తే లేదని ఈ విషయంలో న్యాయపోరాటం చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు కవిత తెలిపారు. అయితే బీఆర్ఎస్ ను విభేదించిన కవిత సొంత పార్టీని స్థాపించి అధికారంలోకి రావడమే లక్ష్యంగా పావులు కదుపుతున్న వేళ పార్టీ విషయంలో ఎదురవుతున్న చిక్కులు కవిత రాజకీయ భవిష్యత్‌పై చర్చకు దారి తీస్తోంది. నిజానికి గత ఫిబ్రవరిలో తెలంగాణ ప్రజా జాగృతి, తెలంగాణ జాగృతి, తెలంగాణ రక్షణ సేన, తెలంగాణ రాష్ట్ర జాగృతి, తెలంగాణ ప్రజా శక్తి అనే ఐదు పేర్లను సూచిస్తూ కవిత సీఈసీకి లేఖ రాశారు. ఈ క్రమంలో ఏప్రిల్ 25న మునీరాబాద్ లో జరిగిన పార్టీ ఆవిర్భావ సభలో తమ పార్టీ పేరు తెలంగాణ రాష్ట్ర సేన అని కవిత అనౌన్స్ చేశారు. జెండాను సైతం ఆవిష్కరించారు.

**మూడు రోజులకే పేరు మార్పు:**

ఆ తర్వాత మూడు రోజులకు ఏప్రిల్ 28న కవిత కొత్త పార్టీ పేరును 'తెలంగాణ రక్షణ సేన'గా ప్రాథమికంగా గుర్తిస్తూ నెల రోజుల్లోగా అభ్యంతరాలు కోరుతూ పత్రికల్లో నోటిఫికేషన్ ఇవ్వాలని ఈసీ ఆదేశించింది. అయితే కేవలం మూడు రోజుల వ్యవధిలోనే తెలంగాణ రాష్ట్ర సేన పార్టీ కాస్త తెలంగాణ రక్షణ సేనగా మారడం పెద్ద ఎత్తున చర్చగా మారింది. అయితే తెలంగాణ రక్షణ సేన పేరుతోనే కవిత పోరాటాలు చేస్తున్న క్రమంలో తాజాగా ఈసీ అభ్యంతరాలు వ్యక్తం చేయడం ప్రత్యామ్నాయ పేర్లు ఎంపిక చేసుకోవాలని సూచించడంతో ఈ పరిణామాలు కవిత పొలిటికల్ కెరీర్‌పై ఎలాంటి ప్రభావం చూపబోతున్నాయనేది ఆసక్తిగా మారింది.



# హరీష్ రావు దళిత బిడ్డల గురించే అడుగుతున్నారు..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** మంత్రి అడ్లూరి లక్ష్మణ్ మాట్లాడితే దళిత బిడ్డను హరీష్ రావు అవమానించారని అంటున్నారని, కానీ హరీష్ రావు మాట్లాడుతుందే దళిత బిడ్డల కోసమని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. ఒక దళిత బిడ్డ చెప్పుల కంపెనీకి గురుకులాల్లో టెండర్ ఇవ్వమంటే కూడా ఇవ్వలేదు, దాని గురించి హరీష్ రావు ప్రశ్నిస్తున్నారని చెప్పారు. గురుకులాల్లోనే చదువుకున్న మహేశ్ గోగర్ల అనే దళితబిడ్డ టెండర్ కోసం వెళితే అతడివైపు కనీసం చూడలేదని అన్నారు. గన్ పార్క్ వద్దకు వస్తున్న హరీష్ రావు, కేటీఆర్ ను ఎవరు అరెస్ట్ చేశారో తెలియదని అడ్లూరి, పొన్నం ప్రభాకర్ అంటున్నారని ఎవరి చెవిలో పూలు పెడుతున్నారని వ్యాఖ్యానించారు.బీఆర్ఎస్ నాయకులను అరెస్ట్ చేయించింది మీరు కాదా అని ప్రశ్నించారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌కు వెళ్తే హరీష్ రావు, కేటీఆర్ అన్ని ఆధారాలతో వస్తారని గన్ పార్క్ దగ్గరికి చర్చ స్థలం మార్చి, ఈ విషయాన్ని రేవంత్ రెడ్డికి చెప్పి వచ్చిన మాట వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. ఈ మంత్రులు CLP కార్యాలయం నుండి గన్ పార్క్ వద్దకు ఇంటెలిజెన్స్ పోలీసులతో వచ్చిన మాట నిజం కాదా? అని అడిగారు. తమను అరెస్ట్ చేయడానికి వచ్చిన పోలీసులు తనతో కలిసి పని చేసిన వాళ్ళేనని అన్నారు. ఎవరి చెవిలో పూలు పెడుతున్నారు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, అడ్లూరి లక్ష్మణ్ అంటూ ప్రశ్నించారు.

# అప్పుల పేరిట కాంగ్రెస్, బీఆర్ఎస్ డ్రామా..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్రంలో గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు అప్పులు, అవినీతి, అక్రమాలు తప్ప చేసిందేమీ లేదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శనివారం రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన ఆయన.. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై నిప్పులు చెరిగారు. తెలంగాణలో జరుగుతున్న ప్రతి అభివృద్ధి పని వెనుక కేంద్ర ప్రభుత్వ నిధులే ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలకులు రాష్ట్రానికి చేసింది శూన్యమని విమర్శించారు. ఈ రెండు పార్టీలు కలిసి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టాయని, ఏకంగా రూ.10 లక్షల కోట్ల అప్పులు చేసి ప్రజలపై తీవ్ర భారం మోపారని మండిపడ్డారు. ఇలాంటి నిర్లక్ష్యపు పాలన వల్ల తెలంగాణ భవిష్యత్తులో శ్రీలంక, పాకిస్తాన్ దేశాల తరహాలో ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ అప్పుల ఊబి నుండీ రాష్ట్రం బయటపడాలంటే తెలంగాణలో డబుల్ ఇంజన్ సర్కార్ రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

**కేంద్ర నిధుల మళ్లింపు..**

గ్రామాల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం 14, 15వ ఆర్థిక సంఘం నిధులను నేరుగా కేటాయిస్తుంటే, ఇక్కడి పాలకులు ఆ నిధులను పంచాయతీ ఉద్యోగుల జీతాల కోసం డైవర్ట్ చేస్తున్నారని బండి సంజయ్ ఆరోపించారు. కేంద్ర పథకాలపై కోర్టులకు వెళ్లడంపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. "వీబీజీ రామ్ జీ పథకంతో పనిదినాలు పెంచి, శాశ్వత ఆస్తులను సృష్టించడం తప్పా? దీనిపై కోర్టుకు వెళ్లడం ఏంది?" అని ప్రశ్నించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి ఎక్కడ మంచి పేరు వస్తుందోననే ఈర్ష్యతోనే ప్రతిపక్షాలు ఇలాంటి దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నాయని, మోడీ సంక్షేమ ఫలాలను ప్రజలు గమనిస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

# జూలై 20 నుంచి వర్షాకాల సమావేశాలు..

**న్యూ ఢిల్లీ :** పార్లమెంట్ వర్షాకాల సమావేశాల షెడ్యూల్ ఖరారయింది. ఈ ఏడాది వర్షాకాల సమావేశాలు జులై 20వ తేదీన ప్రారంభమై, ఆగస్టు 13వ తేదీ వరకూ కొనసాగుతాయని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాలశాఖ మంత్రి కిరణ్ రిజిజు ఎక్స్ వేదికగా ప్రకటించారు. పలు కీలక అంశాలపై ఈ సమావేశాల్లో చర్చలు జరగనున్నట్లు ఆయన పేర్కొన్నారు. భారత ప్రభుత్వ సిఫార్సు మేరకు.. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము 2026 పార్లమెంట్ వర్షాకాల సమావేశాల నిమిత్తం ఉభయ సభలను ఆహ్వానించేందుకు ఆమోదం తెలిపారు. జులై 20 నుంచి ఆగస్టు 13 వరకూ జరిగే సమావేశాల్లో జాతీయ ప్రాధాన్యత కలిగిన అంశాలపై అర్థవంతమైన చర్చలు, నిర్ణయాలు తీసుకుంటామని తెలిపారు. నాలుగు వారాలపాటు సాగే వర్షాకాల పార్లమెంట్ సమావేశాల్లో మొత్తం 19 సిట్టింగ్స్ ఉంటాయని పేర్కొన్నారు.ప్రస్తుత రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఈ సమావేశాలు ప్రారంభమయ్యేనాటికి పార్లమెంట్లో పార్టీల బలాబలాలు మారే అవకాశం కనిపిస్తోంది. TMCలో అంతర్గత విభేదాలు, డీఎంకే - కాంగ్రెస్ మధ్య పెరుగుతున్న దూరం, ఉద్ధవ్ థాకరే శివసేన నుంచి ఎంపీల నిష్క్రమణ వంటి అంశాలు సభ స్వరూపాన్ని మార్చనున్నాయి. సభలో NDA కూటమి బలం మరింత పెరిగే సూచనలు కనిపిస్తుండగా.. INDIA కూటమి బలం తగ్గే సూచనలు కనిపిస్తున్నాయి. తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన 20 మంది తిరుగుబాటు ఎంపీలు 'NCPI' పార్టీలో విలీనం కావడం, అలాగే ఉద్ధవ్ సేనకు చెందిన ఆరుగురు ఎంపీలు ఏకనాథ్ షిండే నేతృత్వంలోని అసలైన శివసేనలో విలీనం అయ్యే అంశాలపై లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా తుది నిర్ణయం తీసుకోనున్నారు.

**సభ ముందుకు కీలక బిల్లులు:**

ఈ వర్షాకాల పార్లమెంట్ సమావేశాల్లో కేంద్రప్రభుత్వం పలు బిల్లులను ప్రవేశపెట్టేందుకు సిద్ధమవుతోంది. గత సమావేశాల్లో తిరస్కరణకు గురైన మహిళా రిజర్వేషన్ అండ్ నియోజకవర్గాల పునర్విభజన (131వ రాజ్యాంగ సవరణ బిల్లు)కు కేంద్రం అత్యంత ప్రాధాన్యతనిస్తోంది. మంత్రులు, సీఎంల పదవులపై 130వ రాజ్యాంగ సవరణ బిల్లు... అంటే తీవ్రమైన నేరారోపణల కేసుల్లో ముఖ్యమంత్రులు, మంత్రులు, లేదా ప్రధానమంత్రి వరుసగా 30 రోజుల పాటు జ్యుడీషియల్ కస్టడీ లేదా నిర్బంధంలో ఉంటే.. వారు ఆటోమెటిక్ గా తమ పదవులను కోల్పోయేలా చేసే కీలక బిల్లును కేంద్రం తీసుకురానుంది. దేశవ్యాప్తంగా ఒకేసారి ఎన్నికల నిర్వహణకు సంబంధించిన వన్ నేషన్ - వన్ ఎలక్షన్ బిల్లు కూడా కేంద్ర ప్రభుత్వ ఎజెండాలో ఉండే అవకాశం ఉంది. FCRA బిల్లు, వికసిత్ భారత్ శిక్షా అధిష్టాన్ బిల్లు, యాంటీ డోపింగ్ బిల్లులతో పాటు సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్యను పెంచే ఆర్డినెన్స్ స్థానంలో కొత్త బిల్లును ప్రవేశపెట్టనున్నారు. కార్పొరేట్ చట్టం, సెక్యూరిటీస్ మార్కెట్ కోడ్, వేతనాల కోడ్ సెంట్రల్ రూల్స్‌కు సంబంధించిన బిల్లులు కూడా సభ ముందుకు రానున్నాయి.

# రైతులు నష్టపోవద్దు..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు తలెత్తితే రైతులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా జిల్లా వారీగా ప్రత్యామ్నాయ పంట ప్రణాళికలను సిద్ధం చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. శనివారం ఆయన సచివాలయం నుంచి వ్యవసాయం, ఆరోగ్యం, తాగునీరు, విద్యా శాఖల సన్నద్ధతపై జిల్లా కలెక్టర్లతో కలిసి ఒక ఉన్నత స్థాయి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశంలో సంబంధిత శాఖల అగ్ర అధికారులు పాల్గొన్నారు.

**ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన**

కొన్ని జిల్లాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున కలెక్టర్లు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సీఎస్ సూచించారు. వర్షాలు తగ్గితే రైతులు నష్టపోకుండా ఉండేందుకు తగిన సమయాల్లో వారికి మార్గదర్శకాలను అందజేయాలని సూచించారు. నాణ్యమైన విత్తనాలు, ఎరువుల లభ్యత, పంపిణీని నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. స్థానిక వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసేలా రైతన్నల్లో విస్తృత అవగాహన కల్పించాలన్నారు. వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు వీలుగా హెల్త్, పంచాయతీరాజ్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, గ్రామీణ తాగునీటి సరఫరా శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సీఎస్ ఆదేశించారు. క్షేత్రస్థాయిలో తీసుకునే ముందస్తు చర్యల వల్ల సీజనల్ వ్యాధులను సమర్థవంతంగా అరికట్టవచ్చన్నారు. అలాగే వాతావరణ మార్పుల నేపథ్యంలో విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా చూసుకోవాలని కలెక్టర్లను కోరారు. ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఉన్నప్పటికీ ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించే విషయాన్ని ప్రాధాన్యత అంశంగా పెట్టుకోవాలన్నారు.

**అనువైన స్థలాలను గుర్తించండి:**

విద్యాశాఖ సమీక్షలో భాగంగా పాఠశాలల్లో మధ్యాహ్న భోజన కార్యక్రమానికి అవసరమైన వంటశాలల నిర్మాణానికి అనువైన స్థలాలను గుర్తించాలని సంజయ్ జాజు కలెక్టర్లకు సూచించారు. సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుంటూ ఈ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. ప్రాధాన్యత అంశాలపై క్షేత్రస్థాయి అమలును క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని సీఎస్ స్పష్టం చేశారు.

# కేసీఆర్‌కు ఉరేసినా తప్పులేదు..



**మిడ్జిల్,ఫ్లాష్ ఇండియా :** 2006 జులై 4న మిడ్జిల్ మండల ప్రజలు జడ్పీటీసీగా తనను ఆశీర్వదించారని ఆనాడు మిడ్జిల్ ప్రజలు నాటిన మొక్క ఇవాళ పెద్ద వృక్షమైందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తన రాజకీయ ప్రస్థానంలో కీలకమైన మిడ్జిల్ ప్రజలకు రేవంత్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. తన రాజకీయ ప్రస్థానం 20 ఏళ్లు పూర్తైన సందర్భంగా నాగర్ కర్నూల్ జిల్లా మిడ్జిల్‌లో ఏర్పాటు చేసిన కృతజ్ఞత సభలో పాల్గొని మాట్లాడారు. జడ్పీటీసీగా సువర్ణాక్షరాలతో ఒక చరిత్రను లిఖించిన రోజు 2006 జులై 4 అని గుర్తుచేశారు. ఆరోజు అది నా గెలుపు కాదని.. అది మిడ్జిల్ ప్రజల గెలుపు అన్నారు. జడ్పీటీసీగా స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన నన్ను మిడ్జిల్ ప్రజలు అక్కున చేర్చుకున్నారని నాది ఈ నియోజకవర్గం కాకపోయినా ఇక్కడి ప్రజలు నమ్మకంతో గెలిపించారన్నారు. ఆనాడు మీరు తీసుకున్న నిర్ణయం చాలా గొప్పదన్నారు. ఉరుములు ఉరిమినా, పిడుగులు పడ్డా నన్ను కలిసేందుకు వచ్చారు. ఉరుములు ఉరిమినా, పిడుగులు పడ్డా నన్ను కలిసేందుకు వచ్చారన్నారు.

**మిడ్జిల్‌ను భట్టి దద్దత తీసుకోవాలి..**

తనను అక్కున చేర్చుకున్న మిడ్జిల్ మండలం రాష్ట్రంలోనే అభివృద్ధి చెందిన మండలంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత నాపై ఉందన్నారు. అందువల్లే ఈ మండలాన్ని దద్దత తీసుకుని అభివృద్ధి సక్షేమ పనులను సమన్వయం చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను ఆదేశించారు. ఇది డార్క్ మండలం కాదని ఈ ప్రాంత ప్రజలకు వెలుగు రేఖలు వచ్చాయని ప్రభుత్వ లెక్కల్లో తేలాలని సూచన చేశారు. తన 20 ఏళ్ల ప్రజాజీవితంలో ఏ ఒక్కరోజు సెలవు తీసుకోలేదని ప్రతిపక్షంలో ఉంటే ప్రజాసమస్యలపై పోరాటం చేశాను. అధికారంలో సంక్షేమం, అభివృద్ధిపై దృష్టి సారించానన్నారు. అలాగే దీర్ఘకాలికంగా పట్టి పీడిస్తున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించానన్నారు. 40 ఏళ్ల వర్గీకరణ అనే రావణకాష్టాన్ని తనకు అవకాశం వచ్చిన వెంటనే పరిష్కారం చూపించానన్నారు. అలాగే 100 ఏళ్ల బీసీ సమస్యకు జనగణనతో పరిష్కారం చూపించానన్నారు.

**కేసీఆర్‌కు ఉరేసినా తప్పులేదు..**

అనుభవం లేదని నన్ను చాలా మంది అవహేళన చేశారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన నన్ను అన్ని కులాలు, మతాలు, అక్కున చేర్చుకున్నాయి. పేదల సమస్యలు చూసుకుంటూ పెరిగాను. వ్యవసాయం తెలుసు. భూమికి, విత్తనానికి ఉన్న బంధం ఏంటో పరిపాలన చేసే వాడికి ఉండాల్సిన అవగానతోనే గ్రామంలో పెరిగానన్నారు. గ్రామీణ సమస్యలు గడీల్లో ఉన్న దొరలకు తెలియకపోవచ్చు. కానీ గ్రామంలోని సమస్యలు పరిష్కారం అయితేనే రాష్ట్ర సమస్యలు పరిష్కారం అయినట్లు ఉన్నారు. పాలమూరు ప్రజలు పరిపాలనకు పనికిరారా? తట్టపనికి, పార, పలుగు పనికి పాలమూరు బిడ్డ కావాలి కానీ పరిపాలనకు మాత్రం పాలమూరు బిడ్డ వద్దనే దురంహంకారాన్ని బొందపెట్టాల్సిన బాధ్యత ఇక్కడి ప్రజలపై ఉందన్నారు. అహంకారానికి కూడా ఓ హద్దు ఉంటుంది. అహంకారం, అహంభావం పెట్రేగిపోయి గద్దరన్నను గడీల ముందు నాలుగు గంటలు ఎర్రటి ఎండలో కుర్చోబెట్టిన వ్యక్తిన మనం క్షమించాలా? గద్దర్‌ను ఎండలో నిలబెట్టినా కేసీఆర్‌ను ఉరిశిక్షణ వేసినా తప్పులేదన్నారు.'నా వల్ల ఎవరికీ కష్టం నష్టం రావొద్దనేదే నా ఆలోచన. ఆనాడు నాపై జడ్పీటీసీగా పోటీ చేసి ఓడిపోయిన కాంగ్రెస్ అభ్యర్థి రబ్బానీకి ఈనాటి ప్రభుత్వంలో ఏదో ఒక మంచి బాధ్యత ఇస్తామన్నారు. ఈ మేరకు బాధ్యత తీసుకోవాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పార్టీ నేతలను ఆదేశించారు.బీఆర్ఎస్ మళ్లీ అధికారం అనేది కల మాత్రమేనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. అరుంధతి సినిమాలో పశుపతిని గొలుసులతో బంధించినట్లు కేసీఆర్‌ను ఫాంహౌస్‌లో ఈ నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలు గొలుసులతో బంధించారని ఇక ఆయన అక్కడే కుంగి కృశించి పోవాలి తప్ప అధికారం అనేది గతం అన్నారు. ప్రతిపక్ష నాయకుడి పదవి వస్తే ప్రజా సమస్యలపై మాట్లాడరట కానీ అధికారం ఇస్తే దోచుకునేందుకు మాత్రం బయటకు వస్తారట అని ఎద్దేవా చేశారు. తన రాజకీయ ప్రస్థానం 20 ఏళ్లు పూర్తైన సందర్భంగా నాగర్ కర్నూల్ జిల్లా మిడ్జిల్‌లో ఏర్పాటు చేసిన కృతజ్ఞత సభలో సీఎం పాల్గొని మాట్లాడారు.

**పాలమూరు బిడ్డ పరిపాలనకు పనికిరాడా?:**

తనకు అనుభవం లేదని చాలా మంది నన్ను అవహేళన చేశారని సీఎం మండిపడ్డారు. దొరలకు సమస్యలపై అవగాహన ఉండకపోవచ్చు కానీ పేదల మధ్య పెరిగిన నాకు సమస్యలు తెలియదా? తట్టపనికి, మట్టిపనికి మనమే బిడ్డలు కావాలి కానీ పరిపాలనకు పాలమూరు బిడ్డ పనికిరారా? ఇలాంటి దురహంకారాన్ని బొంద పెట్టాల్సిన బాధ్యత ఇక్కడి ప్రజలపై ఉందన్నారు. అహంకారానికి కూడా ఓ హద్దు ఉంటుందన్నారు. అహంకారం, అహంభావం పేట్రేగిపోయి గద్దరన్నను గడీల ముందు నాలుగు గంటలు ఎర్రటి ఎండలో కుర్చోబెట్టిన వ్యక్తిని మనం క్షమించాలా? గద్దర్‌ను ఎండలో నిలబెట్టినా కేసీఆర్‌ను ఉరేసినా తప్పులేదన్నారు.

**ప్రజాపాలన ఎందుకు పోవాలి:**

ప్రజాపాలన పోవాలని, పాపాల భైరవుడు మళ్లీ రావాలని కేసీఆర్ కొడుకు కేటీఆర్, ఆయన అల్లుడు హరీశ్ రావు గద్దల్లా ఉర్లమీద పడి అంటున్నారని సీఎం మండిపడ్డారు. తెలంగాణ ఉద్యమంలో తప్పులను, అబద్ధాలను ప్రజలు క్షమించారు. కానీ రాష్ట్రం వచ్చాక పదేళ్లలో చేసిందేంటి? ఇసుక దోపిడీకి అడ్డువచ్చిన నేరెళ్ల దళితులను లారీలతో తొక్కించారు. పంటలకు గిట్టుబాటు ధర అడిగితే ఖమ్మంలో రైతులకు బేడీలు వేశారు. ప్రశ్నాపత్రాలను పల్లీబఠాణిల్లా అమ్ముకున్నారు. రేషన్ కార్డులు ఇచ్చినందుకు, సన్న బియ్యం ఇచ్చినందుకా? ఉచిత కరెంట్, మహిళలకు ఇచిత బస్సు ప్రయాణం కల్పించినందుకా ఎందుకు ప్రజా పాలన పోవాలని నిలదీశారు. ప్రజాపాలన ఎందుకు పోవాలో ఎక్కడికక్కడ చర్చ పెట్టాలన్నారు.

# భట్టి రంకెలు వేస్తే అంకెలు మారవు



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తమ హయాంలో చేసిన అప్పుల గురించి ఎన్నిసార్లు ప్రశ్నించినా ఒకే సమాధానం ఉంటుందని, తమ సమాధానం మారదని మాజీ మంత్రి హరీష్ రావు స్పష్టం చేశారు. అప్పులపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పేవన్నీ అబద్ధాలని కొట్టిపారేశారు. శనివారం మీడియాతో మాట్లాడిన హరీష్ రావు.. అప్పులపై భట్టి విక్రమార్కకు కౌంటరిచ్చారు. అప్పుల గురించి ఆయన చెప్పినవన్నీ అసత్యాలేనని, లేని అప్పుల్ని ఉన్నట్లుగా చూపించారని ఆరోపించారు. భట్టి తీరు చూస్తుంటే డ్యామేజ్ కంట్రోల్ కోసమే మాట్లాడినట్లు కనిపిస్తోందన్నారు. కాంగ్రెస్ నేతలు పూటకోమాట మాట్లాడుతున్నారని, ఏదైనా ఒక విషయంపై స్టాండ్ తీసుకోవడం లేదని దుయ్యబట్టారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ అడ్డగోలుగా హామీలిచ్చిందని, వాటిని అమలు చేయలేకనే అప్పులను సాకుగా చూపుతున్నారని ధ్వజమెత్తారు. అప్పులపై తాము ఎప్పుడైనా, ఎక్కడైనా ఒకటే మాట చెబుతున్నామని పునరుద్ఘాటించారు. కార్పొరేషన్లు తీసుకునే అప్పులు మళ్లీ అవే చెల్లిస్తాయని, ఈ విషయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేసిన శ్వేతపత్రంలోనే తెలిపిందని గుర్తుచేశారు. అంకెల గారడీతో లేని అప్పులు ఉన్నట్లుగా చూపించే ప్రయత్నం చేశారని, భట్టి రంకెలు వేసినంత మాత్రాన అంకెలు మారవని కౌంటరిచ్చారు. రెండున్నరేళ్ల కాంగ్రెస్ హయాంలో చేసిన అప్పును కూడా భట్టి విక్రమార్క.. బీఆర్ఎస్ హయాంలో చేసినట్లు చూపించారని, రాష్ట్ర ఖజానా నుంచి చెల్లించాల్సింది రూ.4.17 లక్షల కోట్లు మాత్రమేనని హరీష్ రావు స్పష్టం చేశారు. కోపంతో ఊగిపోయినంత మాత్రాన లెక్కలు మారవన్నారు.

## సంపాదకీయం



# జెడ్పీటీసీ టూ సీఎం..

రేవంత్ రెడ్డి రాష్ట్ర రాజకీయాలలో ఒక సంచలనం.. ఆయన వేసే ప్రతి అడుగు ఒక విజయం... ఆ విజయాలకు ఊపిరి పోసింది మిడ్జిల్ మండలం. ప్రతికూల పరిస్థితులను తనకు అనుకూలంగా మలుచుకొని ఎన్నికలలో ఉద్దండులను మట్టి కరిపించి కొడితే కుంభస్థలాన్ని కొట్టాలని రేవంత్ రెడ్డి సరిగ్గా 20 ఏళ్ల క్రితం రాజకీయాల్లో ప్రవేశించి మిడ్జిల్ మండల జెడ్పీటీసీగా పోటీ చేసి అప్పట్లో రాజకీయంలో కాకలు తీరిన యోధుడిగా గుర్తింపు పొందిన రబ్బానినీ ఓడించి చరిత్ర సృష్టించారు. 9 నెలలకే వచ్చిన ఎమ్మెల్సీ ఎన్నికలలో మరో రాజకీయ ఉద్దండుడు జగదీశ్వర్ రెడ్డిని ఓడించి చరిత్ర సృష్టించారు. ఆ తర్వాత వెనుతిరుగని ఆయన రాజకీయ ప్రయాణం మొక్కవోని ఆత్మవిశ్వాసం ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించేలా చేసింది. సరిగ్గా 20 ఏళ్ల క్రితం (2006 జూలై 4న) ఇదే రోజున తాను జడ్పీటీసీగా గెలిచినట్లు ప్రకటించగా.. సరిగ్గా అదే తేదీన ముఖ్యమంత్రి హోదాలో తనకు రాజకీయ జన్మనిచ్చిన ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుకోవడానికి రేవంత్‌రెడ్డి నేడు మిడ్జిల్‌లో పర్యటిస్తుండడం రాష్ట్రవ్యాప్తంగా సర్వత్రా ఆసక్తిని రేకెత్తిస్తోంది.

**జెడ్పీటీసీగా రాజకీయ ప్రస్థానం షురూ...**

సరిగ్గా రెండు దశాబ్దాల క్రితం 2006 స్థానిక సంస్థల ఎన్నికల సమయం. రేవంత్‌రెడ్డి తన సొంత మండలం వంగూరు నుంచి జెడ్పీటీసీగా పోటీ చేయాలని భావించారు. అయితే, రిజర్వేషన్ల మార్పుల వల్ల అక్కడ పోటీ చేసే అవకాశం చేజారింది. మొదట్లో కొంత నిరాశ చెందినప్పటికీ, ఆయన వెనకడుగు వేయలేదు. వెంటనే జనరల్ స్థానమైన మిడ్జిల్ మండలంపై తన దృష్టి సారించారు. అప్పట్లో మిడ్జిల్‌లో కాంగ్రెస్ అభ్యర్థిగా కాకలు తీరిన బలమైన నేత రబ్బాని బరిలో ఉన్నారు. ఆయనను ఢీకొట్టడం అసాధ్యమని చాలామంది వారించినా లక్ష్యం వైపు దూసుకెళ్లే రేవంత్ రెడ్డి స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేశారు.

**మిడ్జిల్‌ను కుదిపేసిన ఆనాటి 'మైండ్ గేమ్'**

పోటీలో కాంగ్రెస్‌తో పాటు టీడీపీ, బీజేపీ తరఫున బలమైన అభ్యర్థులు ఉన్నారు. ఇక్కడే రేవంత్‌రెడ్డి తన రాజకీయ చతురతకు పదును పెట్టారు. స్థానిక సమీకరణాలను అనుకూలంగా మార్చుకుంటూ, అభిమానుల అండతో మిగతా ప్రధాన పార్టీల అభ్యర్థులను (కాంగ్రెస్ మినహా) బరి నుంచి తప్పుకునేలా చేశారు. దాంతో ఈ ఏకైక పోరు ఉమ్మడి రాష్ట్రంలోనే హాట్ టాపిక్‌గా మారింది. 2006 జూన్ 27న పోలింగ్ జరగ్గా జూలై 4న వెలువడిన ఫలితాల్లో అందరి అంచనాలను తలకిందులు చేస్తూ రేవంత్‌రెడ్డి 1,373 ఓట్ల భారీ మెజారిటీతో ఘనవిజయం సాధించి 'సంచలనాల రేవంత్'గా తొలి అడుగు వేశారు అప్పట్లో ఆ విజయం ఉమ్మడి పాలమూరు జిల్లా వ్యాప్తంగానే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఆ తర్వాత తొమ్మిది నెలలకే వచ్చిన స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలలో పోటీ చేసేందుకు రేవంత్ రెడ్డి సిద్ధం అయ్యారు. ఉమ్మడి జిల్లాలోని సీనియర్ నాయకులు, ప్రజా ప్రతినిధులను మాత్రమే కాదు. పార్టీ అధినేత చంద్రబాబు నాయుడును సైతం ఒప్పించారు. జెడ్పీటీసీ ఎన్నికలలో రబ్బాని బలమైన నాయకుడు గా పోటీలో ఉన్నట్లే. అప్పుడు కాంగ్రెస్ పార్టీలో రాజకీయ ఉదండుడిగా ఉన్న జగదీశ్వర్ రెడ్డి ఎమ్మెల్సీగా కొనసాగి మళ్లీ పోటీలో ఉన్నారు.ఆయనపై గెలవడం రేవంత్ రెడ్డి తరం అవుతుందా అన్న ప్రశ్నలు మరోసారి తలెత్తాయి. ఆ ఎన్నికలలో ఓటర్లుగా ఉన్న ఎంపీటీసీలు, జెడ్పీటీసీలలో అధిక భాగం కాంగ్రెస్ వారే ఉండడంతో రేవంత్ రెడ్డి గెలుపు అంత సులభం కాదు అనుకున్నారు. పార్టీలకు అతీతంగా అందరి అభిమానాలను చూరగొని 21 ఓట్ల మెజారిటీతో సంచలన విజయం సాధించారు రేవంత్ రెడ్డి. ఆ ఎన్నికలలో మొత్తం ఓట్లు 1106 కాగా 1105 ఓట్లు నమోదయ్యాయి. వీటిలో రేవంత్ రెడ్డికి 554 ఓట్లు రాగా, కాంగ్రెస్ అభ్యర్థి జగదీశ్వర్ రెడ్డి కి 534 , స్వతంత్ర అభ్యర్థికి ఐదు ఓట్లు వచ్చాయి. మిడ్జిల్ మండలం ఇచ్చిన రాజకీయ జన్మతో అంచలంచలుగా రాజకీయ చతురతతో అడుగులు ముందుకు వేశారు. అది చతురత.. తెగువతో కొడంగల్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీచేసి రాజకీయ ఉద్దండులు గుర్నాథ్ రెడ్డిని ఓడించి మరోసారి రాష్ట్ర రాజకీయాల్లో సంచలనం కలిగించారు. ఆ తర్వాత మూడవసారి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడినా నిరాశ చెందలేదు. రాజకీయ పరిణామాల నేపథ్యంలో టీడీపీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరి పలు కీలక పదవులు చేపట్టి పార్టీని బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషించారు. చివరకు ముఖ్యమంత్రి పదవిని దక్కించుకొని తన లక్ష్యాన్ని పూర్తి చేసుకున్నారు. ఇలా ప్రతి రాజకీయ అడుగుకు కారణమైన మిడ్జిల్ మండలాన్ని, ఆ రోజులలో తన గెలుపు కోసం కృషి చేసిన ముఖ్య నాయకులు, కార్యకర్తలను కలవడానికి రేవంత్ రెడ్డి మిడ్జిల్ మండలంలో పర్యటిస్తున్నారు.

**స్వర్గీయ ద్యాప గోపాల్‌రెడ్డి ఆశయాల స్ఫూర్తితో..**

ఉమ్మడి పాలమూరు రాజకీయాల్లో కల్వకుర్తి ఎమ్మెల్యేగా, జడ్పీ చైర్మన్‌గా సుదీర్ఘకాలం పనిచేసి ప్రజల హృదయాల్లో తిరుగులేని నేతగా నిలిచిన స్వర్గీయ ద్యాప గోపాల్‌రెడ్డి అప్పటికే స్వర్గస్థులయ్యారు. రేవంత్‌రెడ్డి తన జెడ్పీటీసీ ఎన్నికల ప్రచారంలో గోపాల్‌రెడ్డి ఆశయ సాధన కోసమే తాను పనిచేస్తానని విస్తృతంగా ప్రచారం చేశారు. ఆ సెంటిమెంట్ గోపాల్‌రెడ్డి అభిమానులను, ద్వితీయ శ్రేణి నాయకులను రేవంత్ వైపు తిప్పింది. ఈ కృతజ్ఞతతోనే నేడు మిడ్జిల్ మండల కేంద్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారికంగా పర్యటిస్తూ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహంతో పాటు, స్వర్గీయ ద్యాప గోపాల్‌రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు.

**వరాల జల్లుపై సర్వత్రా ఆసక్తి!**

ముఖ్యమంత్రి హోదాలో తొలిసారి తన రాజకీయ జన్మభూమికి వస్తున్న రేవంత్‌రెడ్డి మిడ్జిల్ మండలానికి ఎలాంటి నిధులు, అభివృద్ధి పనుల వరాలు ప్రకటిస్తారోనని స్థానిక ప్రజలు, కాంగ్రెస్ శ్రేణులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అధికారులు, పార్టీ నాయకులు ఇప్పటికే మిడ్జిల్‌లో భారీ ఏర్పాట్లు పూర్తి చేశారు.

# తప్పించుకోలేని గండం

## ట్రంప్ తలనొప్పిని రెండున్నరేళ్లు భరించక తప్పదా..?

అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు కోర్టుల్లో వరుస ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. మొన్న హెచ్‌వన్‌బీ వీసా ఫీజు పెంపు విషయంలో చుక్కెదురైతే.. ఇప్పుడు జన్మతఃపౌరసత్వం కేసులోనూ షాక్ తప్పలేదు. అంతకుముందు ఇష్టారాజ్యంగా విధించిన సుంకాలు కూడా చెల్లవని న్యాయస్థానాలు దిమ్మతిరిగేలా తీర్పునిచ్చాయి. కానీ తనకు వ్యతిరేకంగా తీర్పులిచ్చిన జడ్జిలు.. తనను మాత్రమే కాకుండా.. మొత్తంగా దేశాన్నే బాధిస్తున్నారని ట్రంప్ విపరీత భాష్యం చెబుతున్నారు. మొత్తం మీద అధ్యక్షుడైన దగ్గర్నుంచీ తలతిక్క నిర్ణయాలతో అందర్నీ వేపుకుతింటున్న ట్రంప్‌ను మరో రెండున్నరేళ్లు భరించక తప్పని దుస్థితి నెలకొంది. అమెరికా రాజ్యాంగం ప్రకారం, అమెరికా గడ్డపై జన్మించిన దాదాపు పిల్లలందరికీ పౌరసత్వ హక్కు ఉంటుందనే సుదీర్ఘకాలంగా స్థిరపడిన సూత్రాన్ని ఆ దేశ సుప్రీంకోర్టు పునరుద్ఘాటించింది. బర్త్ రైట్ సిటిజన్‌షిప్ కుదరదంటూ ట్రంప్ ఇచ్చిన ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌ను కొట్టేసింది. దీంతో కోట్ల మందికి పెద్ద ఊరట దక్కింది.అమెరికాలో జన్మహక్కు ఆధారంగా పౌరసత్వం కల్పించడాన్ని పరిమితం చేస్తూ అధ్యక్షుడు ట్రంప్ జారీచేసిన కార్యనిర్వాహక ఉత్తర్వును అమెరికా సుప్రీం కోర్టు కొట్టేసింది. అమెరికాలో జన్మించిన శిశువులకు సహజంగా అమెరికా పౌరసత్వం కల్పించే 150 ఏళ్లనాటి న్యాయ ఉదంతాన్ని న్యాయమూర్తులు సమర్థించారు. అంతకుముందు అమెరికాలో అక్రమంగా నివసిస్తున్న లేదా తాత్కాలిక వీసాలపై ఉన్న తల్లిదండ్రులకు జన్మించిన శిశువులకు ఈ జన్మతఃపౌరసత్వాన్ని నిలిపివేస్తూ ట్రంప్ కార్యనిర్వాహక ఉత్తర్వులు జారీచేశారు. అమెరికాలో చట్టవిరుద్ధంగా లేదా తాత్కాలికంగా నివసిస్తున్న తల్లిదండ్రులకు జన్మించిన పిల్లలు, అమెరికా రాజ్యాంగం ప్రకారం పుట్టుకతోనే పౌరులు అవుతారని అమెరికా చీఫ్ జస్టిస్ జాన్ రాబర్ట్స్ స్పష్టం చేశారు. ఈ తీర్పులో ఆయన 14వ రాజ్యాంగ సవరణ చరిత్రను ప్రస్తావించారు. అమెరికా అంతర్యుద్ధం తర్వాత, ఇక్కడే జన్మించి బానిసత్వం నుంచి విముక్తి పొందిన మాజీ బానిసల పౌరసత్వ సమస్యను పరిష్కరించడానికి అప్పట్లో ఈ సవరణను తీసుకువచ్చారు. అప్పుడు, ఇప్పుడు కూడా పౌరసత్వం అనేది హక్కులను పొందే ఒక హక్కు. అమెరికా రాజకీయ వ్యవస్థలో స్వేచ్ఛగా భాగస్వామ్యం పంచుకోవడానికి ఇది ఉపయోగపడుతుంది. 14వ సవరణను రూపొందించిన వారు ఈ భూమిపై జన్మించిన ప్రతి వ్యక్తికీ ఆ హక్కు కల్పిస్తామని వాగ్దానం చేశారు. ఈరోజు ఆ వాగ్దానాన్ని మేం నిలబెడుతున్నాం అని రాబర్ట్స్ తన తీర్పులో పేర్కొన్నారు. కాగా, ఈ తీర్పును విభేదించిన న్యాయమూర్తుల్లో జస్టిస్ క్లారెన్స్ థామస్, జస్టిస్ నీల్ గోర్సచ్, జస్టిస్ శామ్యూల్ అలిటోలు ఉన్నారు.తాను ఎంతగానో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఈ కేసులో ఎదురైన పరాజయంపై అధ్యక్షుడు డోనల్డ్ ట్రంప్ ఇంకా స్పందించలేదు. తన రెండో విడత పదవీకాలంలో వైట్‌హౌస్‌లో అడుగుపెట్టిన మొదటి రోజే, పుట్టుకతో వచ్చే పౌరసత్వ హక్కుకు పరిమితులు విధించాలనే ఉద్దేశంతో ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై సంతకం చేశారు. అక్రమ వలసదారులు, తాత్కాలిక నివాస వలసదారులకు పుట్టిన పిల్లలు ఆటోమేటిక్‌గా అమెరికా పౌరులు కాకుండా నిరోధించేందుకు ట్రంప్ ఈ ఉత్తర్వులు తీసుకొచ్చారు. ట్రంప్ దూరాలోచన మొత్తంగా అమెరికా మౌలిక వలస విధానానికి పెద్ద ఎదురుదెబ్బగా మారింది.అమెరికన్ పౌరసత్వం అర్థం, విలువను పరిరక్షించడం అనే శీర్షికతో ఒక కార్యనిర్వాహక ఉత్తర్వును ట్రంప్ గతంలో జారీ చేశారు. ట్రంప్ రెండో పదవీకాలం మొదటి రోజైన జనవరి 20, 2025న జన్మహక్కు పౌరసత్వంపై న్యాయ పోరాటం ప్రారంభమైంది. ట్రంప్ ఆర్డర్ ప్రకారం..అమెరికా గడ్డపై జన్మించిన పిల్లలకు ఇకపై ఆటోమేటిక్‌గా పౌరసత్వం మంజూరు అవ్వదు. ప్రత్యేకంగా, అమెరికాలోకి చట్టవిరుద్ధంగా ప్రవేశించిన వలసదారులకు జన్మించిన పిల్లలకు పౌరసత్వం లభించదు. అంతేకాకుండా, విద్యార్థి, పని, లేదా పర్యాటక వీసాల వంటి చెల్లుబాటు అయ్యే, కానీ తాత్కాలిక వీసాలపై అమెరికాలో నివసిస్తున్న తల్లిదండ్రులకు జన్మించిన పిల్లలకు కూడా పౌరసత్వం మంజూరు కాదు. అధ్యక్షుడి ఉత్తర్వు తక్షణమే న్యాయపరమైన సవాళ్లను ఎదుర్కొంది. పౌర హక్కుల సంస్థలు, వలసదారుల హక్కుల సంఘాలు, గర్భిణీ స్త్రీలు న్యాయస్థానాలను ఆశ్రయించి, వ్యాజ్యాలు కొనసాగుతున్న సమయంలో ఆ ఉత్తర్వు అమలును నిలిపివేయడంలో విజయం సాధించారు. నిజానికి బర్త్ రైట్ సిటిజన్‌షిప్ విషయంలో ట్రంప్ ఉత్తర్వు ఎన్నడూ అమలు కాలేదు. ఈ వ్యవహారాన్ని విచారించిన దిగువ కోర్టులు గతంలోనే ట్రంప్ ఉత్తర్వులను నిలిపివేయగా, తాజాగా అమెరికా సుప్రీం కోర్టు కూడా అదే నిర్ణయాన్ని సమర్థించింది. ట్రంప్ జారీ చేసిన ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని తేల్చిచెప్పింది. దీంతో అమెరికాలో పుట్టిన ప్రతి చిన్నారికి పౌరసత్వ హక్కు కొనసాగనుంది.జన్మతఃపౌరసత్వం కేసులో తీర్పు సందర్భంగా అమెరికా సుప్రీంకోర్టు.. ఆ దేశ మౌలిక విలువల్ని మరోసారి గుర్తుచేసింది. అమెరికా ఒక జాతి కాదు. అది నానాజాతుల సమూహంగా ఏర్పడింది. అలాగే అమెరికాకు వేల ఏళ్ల చరిత్ర కూడా లేదు. అమెరికా ఉనికి వయసు కేవలం నాలుగు వందల ఏళ్లే. అలా చూసినప్పుడు అమెరికా ఎవరిదీ కాదు. భూమ్మీద ఉన్నవారందరికీ అమెరికాలో సమాన అవకాశాలు కల్పిస్తామని ఆ దేశ రాజ్యాంగ నిర్మాతలు వాగ్దానం చేశారు. అందుకు అనుగుణంగానే అమెరికా రాజ్యాంగం రూపొందింది. అందుకే అమెరికా అవకాశాల స్వర్గంగా పేరు తెచ్చుకుంది. మధ్యలో వలసదారులపై ఆంక్షలు, నియంత్రణలు, షరతులకు కూడా అమెరికా కాంగ్రెస్ ఎప్పుడూ ఒప్పుకోలేదు. ఇంకా మాట్లాడితే.. ఏ రూపంలో అయినా అమెరికన్లకూ, వలసదారులకూ తేడా చూపించే ఏ రకమైన విధానాన్నీ అమెరికా ఒప్పుకోలేదు. అలాంటి ఘన వారసత్వం ఉన్న అమెరికాకు.. ఇప్పుడు ట్రంప్ లాంటి తలతిక్క అధ్యక్షుడు వచ్చారు. అసలైన అమెరికా అంటే అర్థం చేసుకోలేని ట్రంప్.. అమెరికన్లపై జాతుల భేదాన్ని, వర్ణ వివక్ష లాంటి అనాగరిక విధానాల్ని రుద్దటానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. పైగా వీటన్నింటికీ అమెరికాకు సంబంధమే లేని జాతీయవాదం ముసుగేసి.. ఎన్నికల అజెండాలో ఇచ్చిన హామీల ప్రకారం.. వరుసగా వివాదాస్పద నిర్ణయాలు తీసుకుంటూ వచ్చారు. దీంతో ఎక్కడికక్కడ ట్రంప్ దూకుడుకు కోర్టులు అడ్డుకట్ట వేస్తూ వచ్చాయి. అసలు అమెరికా కోర్టులు ఇంత క్రియాశీలకంగా లేకపోతే.. ఈపాటికి ట్రంప్ అమెరికాను ఏం చేసేవారోనని అమెరికన్లు తల్లడిల్లుతున్నారు.అమెరికా రాజ్యాంగంలోని 14వ సవరణలోని సిటిజన్‌షిప్ క్లాజ్‌ను కూడా సుప్రీం కోర్టు ప్రస్తావించింది. అమెరికాలో చట్టవిరుద్ధంగా లేదా తాత్కాలికంగా నివసిస్తున్న విదేశీయుల పిల్లలు అక్కడ జన్మించినా వారికి కూడా జన్మతః పౌరసత్వం వర్తిస్తుందని స్పష్టం చేసింది. అంతేకాదు, గతంలో ఇచ్చిన యునైటెడ్ స్టేట్స్ వర్సెస్ వాంగ్ కిమ్ ఆర్ కేసు తీర్పును కూడా ఆధారంగా తీసుకుంది. ఆ తీర్పులో విదేశీ తల్లిదండ్రులకు అమెరికాలో జన్మించిన పిల్లలకు పౌరసత్వ హక్కు ఉంటుందని ఇప్పటికే తేల్చిచెప్పింది. ఈ తీర్పుతో ట్రంప్ ప్రభుత్వం ముందుకు తెచ్చిన వలస విధానానికి గట్టి ఎదురుదెబ్బ తగిలినట్లైంది. అక్రమ వలసలను అరికట్టడం, బర్త్ టూరిజంకు ముగింపు పలకడం తన రెండో విడత పాలనలో ప్రధాన లక్ష్యమని ట్రంప్ పలుమార్లు ప్రకటించారు. అమెరికాకు వచ్చి పిల్లలకు జన్మనిచ్చి పౌరసత్వం పొందే విధానాన్ని నిలిపివేయాలన్నదే తన ఉద్దేశమని ఆయన గతంలో స్పష్టం చేశారు.అమెరికా సుప్రీంకోర్టు తీర్పును పౌర హక్కుల సంఘాలు, వలసదారుల హక్కుల కోసం పనిచేస్తున్న సంస్థలు స్వాగతించాయి. అమెరికా మాజీ అధ్యక్షుడు జో బైడెన్‌కు మాజీ సలహాదారుగా పనిచేసిన అజయ్ భుటోరియా ఈ తీర్పును చరిత్రాత్మక విజయంగా అభివర్ణించారు. ఇది అమెరికా రాజ్యాంగానికి, న్యాయానికి, అమెరికన్ డ్రీమ్‌కు లభించిన గొప్ప విజయమని అన్నారు. 14వ రాజ్యాంగ సవరణను పరిరక్షించడం ద్వారా పిల్లల హక్కులను కాపాడినట్లు సుప్రీం కోర్టు స్పష్టం చేసిందన్నారు. దక్షిణాసియా దేశాల నుంచి వెళ్లిన వలస కుటుంబాలు సహా కోట్లాది మంది వలసదారులు అమెరికా ఆర్థిక వ్యవస్థ, సంస్కృతి, సామాజిక అభివృద్ధికి విశేషంగా తోడ్పడ్డారనేది కాదనలేని సత్యం. అమెరికా 250 ఏళ్ల ప్రయాణాన్ని పూర్తి చేసుకునే వేళ ఈ తీర్పు దేశ రాజ్యాంగ విలువలను మరోసారి బలపరిచిందన్నారు. తల్లిదండ్రుల వలస హోదా కారణంగా పిల్లల భవిష్యత్తు నిర్ణయించబడదని, అమెరికా సమాన అవకాశాల దేశంగానే కొనసాగుతుందని వ్యాఖ్యానించారు. మరోవైపు ట్రంప్ ప్రభుత్వం తరఫు న్యాయవాదులు 14వ సవరణను వేరే కోణంలో అర్థం చేసుకోవాలని కోర్టును కోరారు. అమెరికాలో శాశ్వతంగా నివసించే ఉద్దేశం ఉన్నవారికే జన్మతః పౌరసత్వం వర్తించాలని వాదించారు. అయితే సుప్రీం కోర్టు ఆ వాదనను అంగీకరించలేదు. రాజ్యాంగ స్ఫూర్తి ప్రకారం అమెరికాలో జన్మించిన ప్రతి వ్యక్తికి పౌరసత్వ హక్కు వర్తిస్తుందని తేల్చిచెప్పింది.




సంపదకియం పేజీలో రచనలు పంపవలసిన వాట్సాప్ నంబర్ మెయిల్ ఐడి 9951512539
flashindia999@gmail.com


# జోరుగా పాఠ్యపుస్తకాల దందా..!

**ప్రైవేటు పాఠశాలల్లో విద్యతోపాటు ఇతరత్రా వ్యాపారం జోరుగా సాగుతోంది. యూనిఫాంలు, నోటు పుస్తకాలు, సాక్సుల వ్యాపారం చేస్తూ దొరికినంత దండుకుంటున్న యాజమాన్యాలు ఏకంగా ప్రభుత్వ పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్ విక్రయిస్తూ అందినకాడికి దండుకుంటున్నారు. దుకాణాల యాజమాన్యాలతో కుమ్మక్కయిన ప్రైవేట్ స్కూళ్ల నిర్వాహకులు కమీషన్ల కోసం పాఠశాలల్లోనే కౌంటర్లు ఏర్పాటు చేసి విద్యార్థులకు పుస్తకాలు విక్రయిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పూర్తి ఉచితంగా పాఠ్య పుస్తకాల పంపిణీ జరుగుతుండగా, ప్రైవేటు పాఠశాలల్లో మాత్రం ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. అయితే ప్రైవేట్ స్కూల్ యాజమాన్యం మాత్రం వాటిని రెట్టింపు ధరలకు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. షాపు యజమానుల ప్రోత్సాహంతో పాఠశాలల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి అక్కడే కొనాలని పోషకులపై ఒత్తిడి తెస్తున్నట్లు ఆరోపణలున్నాయి. పాఠ్య పుస్తకాలు, నోటు బుక్కులు, యూనిఫాంలు, సాక్సులు తదితర సామాగ్రి మొత్తం తమ దగ్గర కొంటేనే చెల్లుబాటు అవుతాయని చెబుతుండటంతో తప్పనిసరి పరిస్థితుల్లో విద్యార్థుల పోషకులు యాజమాన్యాలు నిర్ణయించిన ధరలు చెల్లిస్తూ కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రైవేటు పాఠశాలల్లో పుస్తకాల విక్రయ దందాను విద్యా శాఖ అధికారులు అరికట్టాలనే డిమాండ్‌లు తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకుల నుంచి వినిపిస్తున్నాయి.**



**నాగిరెడ్డిపేట్,ఫ్లాష్ ఇండియా :** ప్రైవేట్ పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు విక్రయించకూడదని నిబంధనలు ఉన్నప్పటికీ నిబంధనలకు విరుద్ధంగా అడ్డదారుల్లో యధేచ్ఛగా పాఠ్యపుస్తకాల వ్యాపారం జోరుగా సాగుతోంది. అయినా విద్యా శాఖ అధికారులు కన్నెత్తి చూడకపోవడంతో బహిరంగంగానే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల ఒకటి రెండు పాఠశాలలను స్థానిక విద్యాశాఖ అధికారులు తనిఖీ చేసినప్పటికీ వారికి పాఠ్యపుస్తకాల వ్యాపారం కనిపించకపోవడం శోచనీయం. ప్రైవేట్ పాఠశాలకు సంబంధించిన పాఠ్యపుస్తకాలు ఎలాంటి అనుమతులు లేకుండా అధిక ధరలకు విక్రయిస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ఆరోపణలు వస్తున్నాయి. నాగిరెడ్డిపేట్ మండల కేంద్రంలో గల ప్రైవేటు పాఠశాలలు విద్యార్థులకు అవసరమైన పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్కులు ఓ దుకాణదారుడితో కుమ్మక్కై ప్రైవేట్ వ్యక్తుల ద్వారా విక్రయిస్తూ తల్లిదండ్రులపై అదనపు ఆర్థిక భారం మోపుతున్నారని వారు పేర్కొన్నారు. పాఠశాల యాజమాన్యం సూచించిన చోటే పుస్తకాల కొనుగోలు చేయాలని పాఠశాల యాజమాన్యాలు సూచిస్తున్నాయని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. తల్లిదండ్రుల వివరాల ప్రకారం.. నర్సరీ విద్యార్థులకు రూ. 2,550,ఎల్‌కేజీకి రూ. 2,550, యూకేజీకి రూ. 3,075, మొదటి తరగతి నుంచి 5వ తరగతి వరకు రూ. 4,045 వరకు వసూలు చేస్తున్నట్లు తల్లిదండ్రులు ఆరోపించారు. దీంతో పేద, మధ్యతరగతి విద్యార్థుల తల్లిదండ్రులకు చదువు భారమైంది. ఒక ఇంట్లో ఇద్దరు విద్యార్థులు ఉంటే పాఠ్య పుస్తకాలకు సుమారు రూ. 10వేలు ఖర్చు చేయాల్సి వస్తుందని, దీంతో పాటు అదనంగా యూనిఫామ్, టై బెల్టులకు కూడా ఖర్చు అవుతుందని వాపోతున్నారు. అధిక ధరలకు పాఠ్య పుస్తకాలు విక్రయిస్తున్న పాఠశాలలపై విద్యాశాఖ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని, ఇప్పటికైనా అధిక ధరలకు పుస్తకాలు విక్రయిస్తున్న వ్యాపారంను అరికట్టాలని తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ విషయమై మండల విద్యాశాఖ అధికారి వెంకట్ రెడ్డిని వివరణ కోరగా పాఠ్యపుస్తకాలు అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఆరోపణలు రావడంతో బుధవారం దుకాణాన్ని తనిఖీ చేసి విద్యార్థులకు సరసమైన ధరలకు పాఠ్య పుస్తకాలు అందించాలని సూచించడం గమనార్హం.

# ఫార్మా కంపెనీల కొత్త ఎత్తుగడ..



**సంగారెడ్డి /జిన్నారం,ఫ్లాష్ ఇండియా :** చెరువులు, కుంటల్లోకి ఫార్మా కంపెనీలు వదులుతున్న కాలుష్య జలాలతో ఆ ప్రాంతం అగమవుతున్నది. పంటలు విషతుల్యం, మనుషులకు అంతుచిక్కని వ్యాధులు, ఆ నీళ్లు తాగి పశువులు మృత్యువాత ఈ పరిణామాలతో ఊరిడిచి వెళ్లే పరిస్థితి. కంపెనీలకు వ్యతిరేకంగా ఉద్యమాలు కొనసాగుతూనే ఉన్నాయి. జనం ఆందోళనకు ఫార్మా కంపెనీ మందుగోలి లాంటి ప్లాన్ చేసింది. కాలుష్యం వదిలేయండి. మీ కుంటలను సుందరీకరిస్తామని ముందుకొచ్చింది. అవసరమైతే రూ. 4 కోట్లు వేచిస్తామని గ్రామ లీడర్లతో చెప్పిస్తున్నది. ఇది తెలిసి గ్రామస్తులు నిప్పులు చెరుగుతున్నారు. కుంటలోకి కాలుష్య జలాలు రాకపోతే అదే చాలు.. సుందరీకరణ ఎందుకు..? అని ప్రశ్నిస్తున్నారు. కంపెనీతో ములాఖాత్ అయిన లీడర్లు గ్రామస్తుల నుంచి వ్యతిరేకత చూసి ఖంగు తింటున్నారు. గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని దోమడుగు నల్లకుంట వ్యవహారం ఇది. వివరాల్లోకి వెళితే...

**అప్పుడు గులాబీ..ఇప్పుడు నల్లరంగులోకి..**

దోమడుగు నల్లకుంట అంటే ఈ ప్రాంతంలో తెలియని వారుండరు. ఎందుకంటే ఎక్కడా లేని విధంగా ఈ కుంట జలాలు గులాబీ రంగులో ఉంటాయి. వర్షకాలం వచ్చిందంటే మీడియాలో ఈ కుంటలోని కాలుష్య జలాల కథనాలే కనిపిస్తాయి. సమీపంలోని హెటిరో ఫార్మా కంపెనీతో పాటు మరో రెండు చిన్న కంపెనీలు ఈ కుంటలోకే కాలుష్య జలాలను ఏళ్లుగా వదులుతున్నాయి. కాగా ఇటీవలి వర్షాలకు నీళ్లు పూర్తిగా నల్లరంగులోకి మారిపోయాయి. ఈ నీళ్లు తాగి పశువుల ప్రాణాలు పోతుండగా ఆ ప్రాంతంలో పంటలు పూర్తిగా విషతుల్యం అయ్యాయి. స్థానిక ప్రజలు క్యాన్సర్, చర్మ వ్యాధుల బారిన పడుతున్నారు. ఈ కంపెనీపై ఎంతో కాలంగా గ్రామస్తులు పోరాడుతూనే ఉన్నారు. ఈ మధ్య వరుస ఆందోళనలు చేపట్టారు. కలెక్టర్ ముందు ఆ జలాలతో ధర్నా చేశారు. ఈ క్రమంలో పరిశ్రమ ప్రతినిధులు పలు మార్లు గ్రామస్తులతో చర్చలు జరిపారు. నష్టపరిహారం ఇస్తామని, మరేమైనా సహాయం అందిస్తామని ఆశ చూపారు. కుంటలోకి జలాలు వదలొద్దని డిమాండ్ చేశారు.

**సుందరీకరణ ఎత్తుగడ..**

గ్రామస్తులను శాంతింప చేయడానికి హెటిరో కొత్త డ్రామాకు తెర తీసింది. గుమ్మడిదల మున్సిపాలిటీ, దొమడుగులోని పార్టీల లీడర్లను తమవైపు తిప్పుకున్నారు. ఇక వారితో కథ నడిపిస్తున్నారు. రూ. 4 కోట్లు వెచ్చింది నల్లకుంటను సుందరీకరించడానికి కంపెనీ ముందుకు వచ్చిందని ప్రచారం చేశారు. ఈ మేరకు గ్రామస్తులతో కూడా చర్చలు జరిపారు. అయ్యింది..అయ్యింది.. కుంట బాగు చేసారట చెయ్యనిద్దాం అని ఒప్పించే ప్రయత్నం చేశారు. అయితే కాలుష్య జలాలు రాకుండా చేస్తారా..? అంటే మాత్రం కంపెనీ ప్రతినిధుల నుంచి లీడర్ల నుంచి సమాధానం రావడం లేదు. అంటే వచ్చే కాలుష్యం వస్తుంది. కుంటను మాత్రం సుందరీకరిస్తాని గ్రామస్తులకు అర్థం అయ్యింది. ఈ క్రమంలోనే సుందరీకరణ వద్దు.. కాలుష్య జలాలు రావద్దు.. ఇదే డిమాండ్ ను గ్రామస్తులు గట్టిగా వినిపిస్తున్నారు.

**పూర్తిగా నీటిని తొలగించాలి...**

గ్రామస్తుల పిర్యాదుతో గతంలో అంతే 2007లో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు కుంటలోని జలాలను పూర్తిగా తొలగించిన సందర్భాన్ని గ్రామస్తులు గుర్తు చేస్తున్నారు. ఇప్పుడు కూడా పీసీబీ అధికారులు మరో సారి నీటిని తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇంత జరుగుతుంటే పీసీబీ అధికారులు ఏం చేసున్నట్లు అని ప్రశ్నిస్తున్నారు. లీడర్ల ను మచ్చిక చేసుకుని చెరువును సుందరీకరణ చేయాలని చేస్తే మరో ఉద్యమం చేపడతామని హెచ్చరిస్తున్నారు. కాలుష్య జలాలు కుంటలోకి రాకుండా అడ్డుకట్ట వేసే వరకు ఆందోళన చేస్తామని చెబుతున్నారు. పరిశ్రమతో ఏకమై గ్రామస్తులను ఒప్పించడానికి చేస్తున్న ప్రయత్నాలు విఫలం అవుతుండడంతో లీడర్లు తమ వ్యూహాలకు మరింత పదును పెడుతున్నారు. ఈ వరుస పరిణామాలతో దోమడుగులో ఆసక్తికర చర్చలు జరుగుతున్నాయి. చూడాలి ఏం జరగనుందో...

# సరికొత్త విప్లవం!




**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** సొంత కారు ఉండి, అత్యవసర సమయాల్లో డ్రైవర్ దొరక్క ఇబ్బంది పడే వాహనదారులకు సరికొత్త సాంకేతిక పరిష్కారం అందుబాటులోకి వచ్చింది. ప్రముఖ సామాజిక సేవకులు మేరుగు అశోక్ సారథ్యంలో, తుప్పరి సుహాసిని మేనేజింగ్ డైరెక్టర్‌గా, కొక్కరకొండ మౌనిక డైరెక్టర్‌గా, కొక్కరకొండ సుధాకర్ సిఈఓ గా వ్యవహరిస్తున్న హైదరాబాద్ ఆధారిత స్టార్టప్ సంస్థ 'ఖణతీఅజశీ' యాప్ దేశవ్యాప్తంగా కార్ డ్రైవర్ హైరింగ్ సేవలను వేగంగా విస్తరిస్తోంది. గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ యాప్ స్టోర్‌లలో అందుబాటులో ఉన్న ఈ యాప్ ద్వారా వినియోగదారులు కేవలం నిమిషాల్లోనే సురక్షితమైన, వెరిఫైడ్ ప్రొఫెషనల్ కార్ డ్రైవర్లను బుక్ చేసుకోవచ్చు. డ్రైవర్ ఎంత సమయం సేవలు అందిస్తే, అంత సమయానికి మాత్రమే చెల్లించే పారదర్శక ధరల విధానాన్ని ఈ సంస్థ అమలు చేస్తోంది.

**డ్రైవర్లకు నెలకు ₹60,000 వరకు సంపాదన..**

ఇప్పటివరకు అసంఘటితంగా ఉన్న కారు డ్రైవర్ల నియామక రంగాన్ని సాంకేతికతతో అనుసంధానించి సంఘటిత రంగంగా మార్చడమే ఈ యాప్ ప్రధాన లక్ష్యమని ప్రతినిధులు తెలిపారు. ప్రస్తుతానికి 25,000 మందికి పైగా డ్రైవర్లు ఈ యాప్‌లో నమోదు చేసుకోగా, వారిలో 5,500 మందికి పైగా పూర్తి వెరిఫైడ్ ప్రొఫెషనల్ డ్రైవర్లతో దేశంలోని ప్రధాన నగరాల్లో సంస్థ విజయవంతంగా సేవలను అందిస్తోంది. ఈ ప్లాట్‌ఫారమ్ ద్వారా పనిచేసే డ్రైవర్లు వారి పని గంటలు మరియు డిమాండ్‌ను బట్టి నెలకు ₹60,000 వరకు గౌరవప్రదమైన, స్థిరమైన ఆదాయాన్ని సంపాదించుకునే అద్భుతమైన అవకాశాన్ని కల్పిస్తోంది. రాబోయే ఆరు నెలల్లో దేశవ్యాప్తంగా మరో 1 లక్ష మంది ప్రొఫెషనల్ డ్రైవర్లను తమ ప్లాట్‌ఫారమ్‌లో ఆన్‌బోర్డ్ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు సంస్థ నిర్వాహకులు వెల్లడించారు.



## బాడీ బిల్డింగ్, సిక్స్ ప్యాక్‌పై మోజుతో జిమ్‌కు వెళ్తున్నారా?

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** నగరంలో యువత బలహీనతలను ఆసరాగా చేసుకుని, తక్కువ సమయంలోనే కండలు పెంచుకోవచ్చనే ఆశచూపి ప్రాణాంతక స్టెరాయిడ్ ఇంజెక్షన్లను విక్రయిస్తున్న ఒక ముఠాను హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం రట్టు చేశారు. ఈ అక్రమ దందాకు పాల్పడుతున్న ఆరుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. నగరంలోని పలు ప్రాంతాల్లోని జిమ్‌లను వేదికగా చేసుకుని ఈ నెట్‌వర్క్ సాగుతోంది. బాడీ బిల్డింగ్, సిక్స్ ప్యాక్ బాడీలపై మోజు పెంచుకుంటున్న యువతను టార్గెట్ చేస్తూ.. తక్షణ కండరాల పెరుగుదల కోసం ఈ ముఠా స్టెరాయిడ్ ఇంజెక్షన్లను ఎరగా వేస్తోంది. వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా, ఎలాంటి అనుమతులు లేని ప్రమాదకరమైన హార్మోన్, స్టెరాయిడ్ ఇంజెక్షన్లను బ్లాక్ మార్కెట్లో భారీ ధరలకు విక్రయిస్తున్నట్లు టాస్క్ ఫోర్స్ విచారణలో తేలింది.

**స్టెరాయిడ్ల వినియోగం..**

నగరంలోని పలు ప్రధాన జిమ్‌లలో ఈ స్టెరాయిడ్ల వినియోగం ఎక్కువగా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. నిందితుల నుంచి భారీ ఎత్తున స్టెరాయిడ్ ఇంజెక్షన్లు, నిషేధిత డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. యువత ఇలాంటి షార్ట్‌కట్ పద్ధతుల వైపు వెళ్లి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని, జిమ్ నిర్వాహకులు ఎవరైనా ఇలాంటి అక్రమ విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. ఈ కేసుపై పూర్తి విచారణ జరిపి, ఈ సరఫరా వెనుక ఉన్న ప్రధాన సూత్రధారులను పట్టుకునేందుకు దర్యాప్తును వేగవంతం చేశారు.



## 'ఆరెంజ్ అలర్ట్' జారీ!

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** జూన్ నెలలో మందకొడిగా సాగిన రుతుపవనాల కారణంగా అంతంత మాత్రంగానే వర్షాలు కురిశాయి. దీంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్న క్రమంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నైరుతి రుతుపవనాలు పుంజుకున్నాయి. ఈ రోజు వాతావరణ శాఖ భారీ వర్షాల హెచ్చరికలను జారీ చేసింది. రాష్ట్రంలోని నాలుగు జిల్లాల్లో శనివారం (జూలై 4, 2026) భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అంచనా వేసింది. ఈ నేపథ్యంలో తీవ్రమైన వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్న ఖమ్మం, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు వాతావరణ శాఖ అత్యంత అప్రమత్తతను సూచిస్తూ 'ఆరెంజ్ అలర్ట్' జారీ చేసింది.

**మరో 9 జిల్లాలకు ఎల్లో అలర్ట్**

అతిభారీ వర్షాల హెచ్చరికలతో పాటు రాష్ట్రంలోని మరో తొమ్మిది జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ అంచనా వేసింది. కొమురం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, కరీంనగర్, వరంగల్, హన్మకొండ, మహబూబాబాద్, సూర్యాపేట, కామారెడ్డి జిల్లాలకు 'ఎల్లో అలర్ట్' జారీ చేశారు. వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాల ప్రజలు, ముఖ్యంగా రైతులు అప్రమత్తంగా ఉండాలని, నదులు, వాగులు దాటే ప్రయత్నాలు చేయవద్దని విపత్తు నిర్వహణ శాఖ అధికారులు సూచించారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో కూడా ఆకాశం మేఘావృతమై ఉండి, సాయంత్రానికి తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ నిపుణులు తెలిపారు.

# కవిత కొత్త పార్టీకి ఈసీ షాక్..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ రాష్ట్రంలో కొత్తగా పురుడుపోసుకున్న 'తెలంగాణ రక్షణ సేన' పార్టీకి ఈసీ ఊహించని షాక్ ఇచ్చింది. కల్వకుంట్ల కవిత ప్రతిపాదించిన నూతన రాజకీయ పార్టీ పేరు పై కేంద్ర ఎన్నికల సంఘం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఆమె కొత్తగా పెట్టబోయే పార్టీకి 'తెలంగాణ రక్షణ సేన' గా నామకరణం చేస్తూ రిజిస్ట్రేషన్ కోసం ఈసీకి దరఖాస్తు చేసుకున్న విషయం తెలిసిందే. అయితే, ఈ పేరును మార్చుకోవాల్సిందేనని స్పష్టం చేస్తూ ప్రధాన ఎన్నికల కమిషనర్ కవితకు అధికారికంగా లేఖ రాశారు. రాబోయే 15 రోజుల్లోగా మూడు ప్రత్యామ్నాయ పేర్లను తమకు సమర్పించక పోతే, ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా పార్టీ రిజిస్ట్రేషన్ దరఖాస్తును పూర్తిగా మూసివేస్తామని ఈసీ గడువు విధించినట్లు తెలుస్తోంది.

**ఆ అభ్యంతరాలే కారణం..**

గతంలో కేసీఆర్ నేతృత్వంలోని 'తెలంగాణ రాష్ట్ర సమితి' పార్టీ కూడా 'టీఆర్ఎస్' అనే సంక్షిప్త నామంతోనే గుర్తింపు పొందింది. ఆ తర్వాత దానిని భారత్ రాష్ట్ర సమితి గా మార్చారు. ఇప్పుడు కవిత మళ్లీ అదే సంక్షిప్త నామం వచ్చేలా 'తెలంగాణ రక్షణ సేన' అని పేరు పెట్టడం పై ప్రజల నుండి, వివిధ వర్గాల నుండి ఎన్నికల సంఘానికి పెద్ద ఎత్తున అభ్యంతరాలు, ఫిర్యాదులు వ్యక్తమయ్యాయి. పాత పార్టీ పేరును, సెంటిమెంట్‌ను తలపించేలా ఈ కొత్త పేరు ఉండటం వల్ల ఓటర్లలో తీవ్ర గందరగోళం నెలకొనే అవకాశం ఉందని ఈసీ అభిప్రాయపడినట్లు తెలుస్తోంది. దీంతో ఆ పేరును కొనసాగించడం కుదరదని స్పష్టం చేస్తూ, కవితకు పంపిన లేఖలో ఈసీ ఈ విషయాలను పొందుపరిచినట్లు వార్తలు వస్తున్నాయి. కాగా ఈ వ్యవహారంపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.




# ఉపాధ్యాయుడే ప్రైవేట్ పీఆర్వో

**సూర్యాపేట,ఫ్లాష్ ఇండియా :** ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వహించాల్సిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థకు అనధికారికంగా ప్రజా సంబంధాల అధికారిగా(పీఆర్వో) వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు జిల్లాలో చర్చనీయాంశంగా మారాయి. విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పాల్సిన ఉపాధ్యాయుడు, ప్రభుత్వ ఉద్యోగ బాధ్యతలు పక్కనపెట్టి కార్పొరేట్ పాఠశాలలకు అడ్మిషన్లు తీసుకరావడం పై దృష్టి పెట్టారనే విమర్శలు వినిపిస్తున్నాయి. సూర్యాపేట మండల పరిధిలోని ఓ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు, పదో తరగతి, ఇతర ప్రవేశ పరీక్షల్లో మంచి ర్యాంకులు సాధించిన విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని వారి కుటుంబాలను సంప్రదిస్తూ డబ్బులు ఎర చూపి ర్యాంకులు వెలువడిన రోజే విద్యార్థుల ఇళ్లకు చేరుకుని, కార్పొరేట్ పాఠశాలల్లో చేరితే ఒక్కో అడ్మిషన్‌కు రూ. 5 లక్షల నుంచి రూ. 7 లక్షల వరకు ప్రోత్సాహకాలు, ఇతర సౌకర్యాలు కల్పిస్తామని హామీలు ఇస్తూ కార్పొరేట్ సంస్థలో విద్యార్థుల ను చెరిపిస్తున్నడని విమర్శలు గుప్పుమంటున్నాయి.

**ప్రభుత్వ ఉపాధ్యాయుల పిల్లలే టార్గెట్..**

ప్రభుత్వ ఉపాధ్యాయుల పిల్లలను కార్పొరేట్ విద్యాసంస్థల్లో చేర్పించేందుకు ప్రత్యేకంగా ప్రయత్నిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొద్ది రోజుల క్రితం వెలువడిన 10 వ తరగతి పరీక్ష ఫలితల లో ఓ డాక్టర్ కూతురు కి టాప్ ర్యాంక్ రావడం తో ఆ విషయం తెలుసుకున్న ఈ ప్రభుత్వ ఉద్యోగి వాళ్ళ ఇంటి చుట్టూ ప్రతి రోజు తిరుగుతూ కార్పొరేట్ కాలేజీలో చేర్పించాలని వాళ్లని ఇబ్బంది పెట్టిన దాఖలలు ఇప్పుడు ఈ నోట ఆ నోట పడి బయటకు పొక్కింది. హైటెక్ బస్ స్టాండ్ వెనుక ఉన్న ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు వాళ్ల తనయుడు ఏ ఎస్ రావు పరీక్ష ఫలితాల్లో అత్యధిక ర్యాంక్ రావడం తో ఆ విద్యార్థి తల్లిదండ్రులకు రూ. 5 లక్షలు ఆఫర్ చేసి సూర్యాపేట పాఠశాలలో కాకుండా కార్పొరేట్ పాఠశాలకు పంపించడం గమనర్హం. ఈ విధంగా అడ్మిషన్లు పెంచి భారీ మొత్తంలో కమిషన్లు పొందుతూ కోట్ల రూపాయలకు ఆ ప్రభుత్వ ఉపాధ్యాయుడు పడగేత్తాడనీ స్థానికంగా చర్చ జరుగుతోంది.

**ప్రభుత్వ సేవలో ఉండి ప్రైవేట్ విద్యాసంస్థలకు అనుకూలంగా..**

ప్రభుత్వ సేవలో ఉండి ప్రైవేట్ విద్యాసంస్థలకు అనుకూలంగా వ్యవహరించడం సేవా నియమావళికి విరుద్ధమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారంపై సంబంధిత విద్యాశాఖ అధికారులకు సమాచారం ఉన్నప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని పలువురు ఆరోపిస్తున్నారు. పదో తరగతి, ఇంటర్, ప్రవేశ పరీక్షల్లో మంచి ర్యాంకులు సాధించిన విద్యార్థుల వివరాలను సేకరించి వారినే లక్ష్యంగా చేసుకొని ఫలితాలు వెలువడిన రోజే ఉదయం విద్యార్థుల ఇళ్లకు వెళ్లి కార్పొరేట్ పాఠశాలలు, కాలేజీల్లో చేరాలని తల్లిదండ్రులను ఒప్పించే ప్రయత్నాలు చేస్తున్నారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఒక్కో అడ్మిషన్‌కు రూ. 5 లక్షల నుంచి రూ. 7 లక్షల వరకు కమిషన్ లేదా ప్రోత్సాహకం ఇస్తామని ,ప్రభుత్వ ఉపాధ్యాయుల పిల్లలను, ర్యాంక్ లు వచ్చిన విద్యార్థులను కార్పొరేట్ విద్యాసంస్థల్లో చేర్పించేందుకు ముమ్మర ప్రయత్నం చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను తప్పుదోవ పట్టిస్తున్నారని బహిరంగ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ ఉద్యోగిగా ఉంటూనే ప్రైవేట్ సంస్థల కోసం పనిచేయడం సేవా నియమావళికి విరుద్ధమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రభుత్వ పాఠశాలలో విద్యా నాణ్యత పెంచాల్సిన ఉపాధ్యాయులు కార్పొరేట్ అడ్మిషన్లపై ఎక్కువ దృష్టి పెట్టడం పట్ల స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అడ్మిషన్ల ద్వారా భారీ మొత్తంలో ఆదాయం సంపాదిస్తు కోట్లకు పడగెత్తాడని జిల్లా ప్రజలు బహిరంగంగానే మాట్లాడుకుంటున్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు ప్రభుత్వ ఉద్యోగం చేస్తూ కార్పొరేట్ పాఠశాల కళాశాలలకు కొమ్ముకాస్తున్న టీచర్ పై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

**మా దృష్టికి రాలేదు: డీఈఓ అశోక్**

ప్రభుత్వ టీచర్ గా విధులు నిర్వహిస్తూ ప్రైవేటు పాఠశాలలకు కార్పొరేట్ పాఠశాలలకు కమిషన్ కోసం కక్కుర్తి పడి అడ్మిషన్ పంపిస్తూన్నరన్న విషయం మా దృష్టికి రాలేదని డీఈవో అశోక్ తెలిపారు. అలా ఎవరైనా ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వహిస్తూ ప్రైవేటు పాఠశాలలకు కొమ్ముకాస్తున్నారన్న విషయం మా దృష్టికి వస్తే వెంటనే వారిపై చర్యలు తీసుకుంటాం. ఎవరైనా ఫిర్యాదు చేసిన ఫిర్యాదు అందిన వెంటనే వారిపై చర్యలు తీసుకుంటాం. ఫిర్యాదు చేసిన వారి సమాచారశీ గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

# డిండి ప్రాజెక్టులు పూర్తి చేస్తాం



**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** మిర్యాలగూడ నియోజకవర్గ పరిధిలో బండారు ఆగ్రోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో రూ.150 కోట్ల వ్యయంతో నిర్మించిన అత్యాధునిక రైస్ మిల్లును రాష్ట్ర పౌర సరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మిర్యాలగూడలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రైస్ మిల్లును నిర్మించిన బండారు కుశలయ్యను అభినందించారు. ఈ మిల్లు ద్వారా రైతులకు, వ్యవసాయ రంగానికి మరింత మేలు జరగాలని ఆకాంక్షించారు. తాను వ్యక్తిగతంగా రైస్ మిల్లుల ప్రారంభోత్సవాలకు హాజరుకానప్పటికీ, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, బండారు కుశలయ్య ఆహ్వానం మేరకు ఈ కార్యక్రమానికి వచ్చినట్లు తెలిపారు. ఈ మిల్లులో ఏర్పాటు చేసిన ఆధునిక యంత్రాలు, గోదాముల నిర్మాణ విధానం రాష్ట్రానికి ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. తక్కువ శ్రామిక శక్తితో అధిక సామర్థ్యంతో ధాన్యాన్ని నిల్వ చేసే విధానాలను రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసే దిశగా సివిల్ సప్లైస్ శాఖ చర్యలు తీసుకుంటోందన్నారు. నిల్వల సమయంలో ధాన్యం వృథాను తగ్గించి, ఆధునిక గోదాముల నిర్మాణానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ధాన్యం కొనుగోళ్లలో తెలంగాణ దేశంలోనే రికార్డు సృష్టించిందన్నారు. 2023-24 రబీ సీజన్‌లో 47 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయగా, తాజా సీజన్‌లో 81 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. రైతులకు ఇప్పటి వరకు రూ.19,300 కోట్లను నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. ఈ యాసంగి సీజన్‌లో 13.36 లక్షల మంది రైతులకు సుమారు రూ.7,098.6 కోట్లను చెల్లించినట్లు వివరించారు.ప్రస్తుత శాసనసభ కాలంలోనే ఎస్ఎల్‌బీసీ, డిండి ప్రాజెక్టులను పూర్తి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. సీఎంఆర్ పెండింగ్ బిల్లులను ఎలాంటి జాప్యం లేకుండా చెల్లించేలా చర్యలు తీసుకుంటామని, మిల్లర్లు కూడా ప్రభుత్వానికి పూర్తి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఎల్‌నినో ప్రభావంతో కరువు పరిస్థితులు తలెత్తే అవకాశాలు ఉన్నందున ప్రభుత్వం సూచించే పంటలనే రైతులు సాగు చేయాలని మంత్రి సూచించారు. తెలంగాణలో ఉత్పత్తి అయ్యే బియ్యాన్ని విదేశాలకు ఎగుమతి చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక విధానాన్ని రూపొందిస్తోందని తెలిపారు. ఎగుమతులు చేపట్టే రైస్ మిల్లులకు ప్రత్యేక ఎగుమతి ప్రోత్సాహకాలు (ఎక్స్‌పోర్ట్ ఇన్సెంటివ్స్) అందించే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు.ప్రభుత్వ విప్ వేముల వీరేశం మాట్లాడుతూ, రాష్ట్రంలో అత్యధిక స్థాయిలో ధాన్యం కొనుగోళ్లు నిర్వహించి రైతులకు అండగా నిలిచిన ఘనత మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికే దక్కుతుందని అన్నారు. మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బీఎల్ఆర్) మాట్లాడుతూ, మిర్యాలగూడలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రైస్ ఇండస్ట్రీ ఏర్పాటు కావడం నియోజకవర్గానికి గర్వకారణమని అన్నారు. రైతులకు, మిల్లర్లకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొంటూ బండారు కుశలయ్యకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంకర్ నాయక్, మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఉన్నం కైలాష్ నేత, మున్సిపల్ చైర్‌పర్సన్ చిలుకూరి సుధా బాలకృష్ణ, వైస్ చైర్మన్ గుడిపాటి శిరీష నవీన్, కాంగ్రెస్ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిట్టపల్లి వెంకటేష్, ఆల్ ఇండియా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కర్నాటి రమేష్, మిర్యాలగూడ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గౌర శ్రీనివాస్‌తో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు, రైస్ మిల్లర్ల సంఘాల ప్రతినిధులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**త్వరలో సాగునీటి సమస్యకు చెక్ !**

మిర్యాలగూడ నియోజకవర్గంలోని అడవిదేవులపల్లి మండలం చిట్యాల గ్రామ సమీపంలో నిర్మాణంలో ఉన్న దున్నపోతుల గండి ఎత్తిపోతల ప్రాజెక్టు పనులను మంత్రి కెప్టెన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి, మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రాజెక్టు నిర్మాణ పురోగతి పై అధికారులను అడిగి తెలుసుకున్నారు. చేపట్టిన పనుల నాణ్యత, నిర్మాణ వేగం, సాంకేతిక అంశాలను సమీక్షించారు. మిగిలిన పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి, నిర్ణీత గడువులోగా ప్రాజెక్టును అందుబాటులోకి తీసుకురావాలని ఇరిగేషన్ శాఖ అధికారులకు, నిర్మాణ సంస్థ ప్రతినిధులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ దున్నపోతుల గండి ఎత్తిపోతల ప్రాజెక్టు పూర్తయితే మిర్యాలగూడ నియోజకవర్గంలోని పలు గ్రామాలకు సాగునీటి సౌకర్యం మరింత మెరుగుపడటంతో పాటు రైతులకు గణనీయమైన ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సాగునీటి రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించి వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ప్రాజెక్టు పూర్తయిన అనంతరం ఈ ప్రాంత రైతులకు సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్ ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులు, ఇంజినీర్లు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, స్థానిక రైతులు పాల్గొన్నారు.



## కేజీబీవీ పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలి

**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** మిర్యాలగూడలోని కేజీబీవీ పాఠశాలను జిల్లా విద్యాశాఖ అధికారి సుసింధర రావు శనివారం పరిశీలించారు.విద్యార్థుల తరగతి గదులను మరియు భోజనశాలను మరియు వంట సరుకులను పరిశీలించారు.విద్యార్థుల యొక్క టాయిలెట్స్ ను పరిశీలించి కేజీబీవీ పరిసరాలు ఎప్పుడు పరిశుభ్రత ను పాటించవలసిందిగా ఆదేశించినారు.తరగతి గదులలో ఐఎఫ్ పి ప్యానల్ ఉపయోగించి డిజిటల్ తరగతులను విద్యార్థులకు బోధించాలని ఆదేశించారు.ఈ పర్యటనలో మిర్యాలగూడ మండల విద్యాధికారి డి.ధర్మా నాయక్,ఎస్ఓ నాగమణి లు పాల్గొన్నారు

# చైతన్య విప్లవ స్ఫూర్తి దొడ్డి కొమరయ్య




**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** దొడ్డి కొమరయ్య 80 వ వర్ధంతి సందర్భంగా స్థానిక యాదవ సంఘ భవనం మిర్యాలగూడ నందు యాదవ సంఘం, యాదవ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో వారి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించడం జరిగింది.ఈ సందర్భంగా యాదవ ఉద్యోగుల సంఘం మిర్యాలగూడ డివిజన్ అధ్యక్షులు గుడిపాటి కోటయ్య పట్టణ అధ్యక్షులు కట్టెబోయిన శ్రీనివాస్ యాదవ్ లు మాట్లాడుతూ భూమి కోసం,భుక్తి కోసం,వెట్టి చాకిరి విముక్తి కోసం ఆనాటి దొర,దేశముఖులకు వ్యతిరేకంగా పోరాటం చేసి తెలంగాణా సాయుధ పోరాటంలో తొలి అమరుడు అయిన దొడ్డి కొమురయ్యను స్ఫూర్తిగా తీసుకొని నేడు సామాజికంగా దోపిడీకి గురవుతున్న అణగారిన వర్గాల ప్రజల కోసం,వారి అభివృద్ధి కోసం నిరంతరం ప్రయత్నం చేయాలని అలా చేసినప్పుడే దొడ్డి కొమరయ్య ఆశయాలు సాధించినట్లు అవుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి సరనాల వెంకన్న యాదవ్,కౌన్సిలర్లు పుట్టపాక శ్రీనివాస్,గంగుల బిక్షం,సీనియర్ జర్నలిస్ట్ జంగా లక్ష్మణ్ యాదవ్, యాదవ ఉద్యోగుల సంఘం నాయకులు జానపాటి శ్రీనివాస్, యాదవ సంఘం మిర్యాలగూడ మండల అధ్యక్షులు గుడిపాటి వెంకటేశ్వర్లు,బచ్చనబోయిన మహేష్,నాగేష్,సతీష్ పాల్గొన్నారు.



## యువతి అదృశ్యం.. కేసు నమోదు

**కాప్రా,ఫ్లాష్ ఇండియా :** స్నేహితురాలి పుట్టినరోజు వేడుకలకు ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ యువతి అదృశ్యమైన సంఘటన చెర్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై శేఖర్ కథనం ప్రకారం... అశోక్ నగర్‌లో నివసించే బండాలు రత్నాలు కూతురు బండాలు అంజలి (20) ఈనెల 2వ తేదీన తన స్నేహితురాలి పుట్టినరోజు వేడుకలకు కుషాయిగూడకు వెళ్తున్నట్లు చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్ళింది. అంజలి రాత్రి అయిన ఇంటికి రాకపోవడంతో.. ఆమె ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో బంధుమిత్రుల ఇళ్లలో వెతికిన ఆచూకీ లభించలేదు. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలి...




**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ దామరచర్ల మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక మండల విద్యాధికారి ఆఫీసు ముందు ధర్నా నిర్వహించడం జరిగినది.అనంతరం ఎస్ఎఫ్ఐ దామరచర్ల మండల కార్యదర్శి వీరన్న నాయక్ మాట్లాడుతూ మండల కేంద్రంలో ఉన్నటువంటి ప్రభుత్వ పాఠశాలలో అనేక సమస్యలతో విద్యార్థులకు స్వాగతం పలినటువంటి పరిస్థితి ఉందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే పేద మధ్యతరగతి విద్యార్థినీలకు కనీసం బాత్రూం సౌకర్యం లేకపోవడం చాలా దుర్మార్గమన్నారు.పేద మధ్యతరగతి విద్యార్థులు చదువుకునే ప్రభుత్వ పాఠశాలలో కనీసం బాత్రూం సౌకర్యం లేవంటే ప్రభుత్వాలు నిద్రపోతున్నాయని ప్రశ్నించారు. కనీసం మౌలిక సదుపాయాలు కల్పించకుండా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచాలంటే ఏ విధంగా విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలోకి వస్తారో రాష్ట్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తక్షణమే ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న విద్యార్థులకు రెండు జతల యూనిఫామ్స్ మరియు కావాల్సిన కనీసం మౌలిక సదుపాయాలు కల్పించాలని లేనిపక్షంలో ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళనలకు పూనుకుంటామనీ సందర్భంగా హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో హరీష్,బాల కార్తిక్,హనూక్,జగదీష్,రాజేష్,జగదీష్,చరణ్,త్రివేణి,యశస్విని, భవాని,ఊహ,చరిత,నిర్మల,లక్ష్మి, సుప్రజ,శివాని,గీత,సానియా,శివాని తదితరులు పాల్గొన్నారు.

# ఆపరేషన్ అడ్డా



**కోదాడ,ఫ్లాష్ ఇండియా :** కోదాడ పట్టణంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారి పై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. 'ఆపరేషన్ అడ్డా'లో భాగంగా శుక్రవారం అర్ధరాత్రి పోలీసులు మెరుపు తనిఖీలు నిర్వహించారు. అనవసరంగా రోడ్ల పై సంచరిస్తున్న వారిని లక్ష్యంగా చేసుకుని ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. రాత్రి 11 గంటల తర్వాత సరైన కారణం లేకుండా వీధుల్లో తిరిగే వారిపై ఇక పై ఎలాంటి ఉపేక్ష ఉండదని కోదాడ పట్టణ సీఐ శివశంకర్ స్పష్టం చేశారు. బంజర కాలనీ, శ్రీమన్నారాయణ కాలనీ, నయన్‌నగర్, దుర్గాపురం తదితర ప్రాంతాల్లో ఆకస్మికంగా నిర్వహించిన తనిఖీల్లో రాత్రివేళ గుంపులుగా సంచరిస్తున్న 20 మంది యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించి, వారి తల్లిదండ్రులను పిలిపించారు.తల్లిదండ్రుల సమక్షంలో యువకులకు కౌన్సెలింగ్ నిర్వహించిన పోలీసులు రాత్రివేళల్లో అనవసరంగా బయట తిరగడం వల్ల జరిగే ప్రమాదాలు, నేరాల్లో చిక్కుకునే అవకాశాలు, చట్టపరమైన పరిణామాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ శివశంకర్ మాట్లాడుతూ రాత్రివేళల్లో రోడ్ల పై గుంపులుగా తిరగడం, కాలనీల్లో అడ్డాలు వేసుకుని ప్రజలకు అసౌకర్యం కలిగించడం, అనుమానాస్పదంగా సంచరించడం వంటి చర్యలను ఇక పై ఏమాత్రం సహించబోమని హెచ్చరించారు. పోలీసుల హెచ్చరికలను బేఖాతరు చేస్తే నేరుగా కేసులు నమోదు చేసి, చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.మైనర్ల చేత వాహనాలు నడిపిస్తే తల్లిదండ్రులే బాధ్యత వహించాల్సి ఉంటుందని, వారిపైనే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా మద్యం సేవించి వాహనాలు నడపడం (డ్రంక్ అండ్ డ్రైవ్), ట్రిపుల్ రైడింగ్, అతివేగంగా వాహనాలు నడపడం, ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించడం వంటి వాటి పై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై కేసులు నమోదు చేయడంతో పాటు కఠిన చర్యలు తీసుకోవడం తప్పదని స్పష్టం చేశారు. పట్టణంలో నేరాలకు అడ్డుకట్ట వేయడం, యువతను తప్పుదారి పట్టకుండా కాపాడడం, ప్రజలకు భద్రత కల్పించడమే 'ఆపరేషన్ అడ్డా' లక్ష్యమని సీఐ పేర్కొన్నారు. ఈ ప్రత్యేక డ్రైవ్ ఇకపై నిరంతరం కొనసాగుతుందని, చట్టాన్ని గౌరవిస్తూ పోలీసులకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



## మహిళ దారుణ హత్య

**ఉప్పల్,ఫ్లాష్ ఇండియా :** ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చిలకనగర్ ఆదర్శ్ నగర్‌లో ఒక మహిళ హత్యకు గురైన ఘటన చోటుచేసుకుంది. ప్రాథమిక వివరాల ప్రకారం.. గత నాలుగు సంవత్సరాలుగా సురేష్, జెస్సికా దంపతులు ఆదర్శ్ నగర్‌లో నివాసం ఉంటున్నారు. సురేష్ క్యాబ్ సూపర్వైజర్‌గా, జెస్సికా నర్సుగా పనిచేస్తున్నారు. భార్యపై అనుమానంతో భర్త సురేష్ హత్యకు పాల్పడినట్లు సమాచారం. హత్య అనంతరం నిందితుడు సురేష్ అక్కడి నుంచి పరారైనట్లు తెలిసింది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. నిందితుడి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

## ప్రభుత్వ ఆసుపత్రి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే



**నాచారం,ఫ్లాష్ ఇండియా :** నియోజకవర్గ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి శాయ శక్తుల కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. మల్లాపూర్ ఎలిఫెంట్ సర్కిల్ సమీపంలో నిర్మాణంలో ఉన్న 100 పడకల ప్రభుత్వ ఆస్పత్రి నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. నాణ్యతా ప్రమాణాలకు ఎలాంటి రాజీ పడకుండా నిర్ణీత గడువులో నిర్మాణాన్ని పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆస్పత్రి నిర్మాణం పూర్తయి ప్రజలకు అందుబాటులోకి వస్తే మల్లాపూర్, నాచారం, కాప్రా, హబ్సిగూడ, చర్లపల్లి తదితర ప్రాంతాల ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలు సమీపంలోనే లభిస్తాయని తెలిపారు. దీంతో వైద్య అవసరాల కోసం నగరంలోని ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన ఇబ్బందులు తగ్గడంతో పాటు అత్యవసర పరిస్థితుల్లో సకాలంలో చికిత్స అందే అవకాశం కలుగుతుందన్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఆధునిక వైద్య సదుపాయాలతో ఆస్పత్రిని అభివృద్ధి చేసి ప్రజలకు అంకితం చేయనున్నట్లు తెలిపారు. నిర్మాణ పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా వేగవంతంగా పూర్తి చేసి త్వరలోనే ఆస్పత్రిని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మల్లాపూర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి, అధికారులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## భూమి బాధితులకు న్యాయం చేయాలి..



**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** మిర్యాలగూడ నియోజకవర్గంలోని దామరచర్ల మండల వ్యాప్తంగా భూ బకాసురు ల వల్ల చెరువులు గుట్టలు కుంటలు అసైన్డ్ ఫారెస్ట్ డి ఫారెస్ట్ ఇతర అన్ని రకాల భూములను కబ్జాదారులు కబ్జా చేసుకుని రియల్ ఎస్టేట్ తో అక్రమ వ్యాపారం చేసుకుంటున్నా వారిపై తగిన చర్యలు తీసుకోవాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు ఆరోపించారు. దామరచర్ల మండలంలోని రాజగట్టు గ్రామం పంచాయతీకి చెందిన నాగార్జున సాగర్ ముంపు బాధితుల భూములను కాపాడాలని వారికి పట్టాలు ఇవ్వాలని సిపిఐ మండల సమితి ఆధ్వర్యంలో జిల్లా కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు పాల్గొని ఎమ్మార్వో కు వినతి పత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ గత 40 సంవత్సరాల క్రితం సర్వేనెంబర్ 826,1113 లో పునరావాసం చట్టం కింద రాజగటులో భూములు ఇచ్చారని అన్నారు. మండలానికి చెందిన కొంతమంది భూకబ్జాదారులు రాజకీయ అండదండలతో నాగార్జునసాగర్ ముంపు బాధితుల భూములను సర్వేనెంబర్ 826, 1113, 842,430,ఇతర ఫారెస్ట్ భూములు అక్రమంగా ఆక్రమించి రియల్ ఎస్టేట్ వ్యాపారంగా మార్చుకొని బాధితులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. అక్రమంగా భూములను కబ్జా చేసుకుని రికార్డులను తారుమారు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి బాధితులకు నిజమైన లబ్ధిదారులకు పట్టాలు ఇచ్చి న్యాయం చేయలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి పోలేపల్లి ఉదయ్ కుమార్ సీనియర్ కామ్రేడ్స్ భూ బాధితులు గజ్జల లక్ష్మీ నరసింహ రెడ్డి,శ్రీనివాస్ రెడ్డి జమ్ముల కోటయ్య,భాగం శేషయ్య,తావూరియా,సైదా తదితరులు పాల్గొన్నారు.

# బుడ్డోడు ఆడినా బెదరాల్సిందే!




భారత్‌తో జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో భాగంగా మాంచెస్టర్‌లోని ఓల్డ్ ట్రాఫోర్డ్ వేదికగా ఈరోజు జరగనున్న రెండో టీ20కి ఇంగ్లండ్ తమ తుది జట్టును ప్రకటించింది. తొలి మ్యాచ్ వర్షం కారణంగా రద్దవడంతో.. ఇప్పుడు ఇరు జట్లు సిరీస్‌లో ఆధిక్యం సాధించాలనే లక్ష్యంతో బరిలోకి దిగుతున్నాయి. ఈ కీలక మ్యాచ్‌కు ముందు ఇంగ్లండ్ తమ ప్లేయింగ్ ఎలెవన్‌లో రెండు కీలక మార్పులు చేసింది. స్టార్ ఫాస్ట్ బౌలర్ జోఫ్రా ఆర్చర్ మళ్లీ తుది జట్టులోకి వచ్చాడు. అలాగే యువ పేసర్ జోష్ టంగ్ టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేయనున్నాడు. జోఫ్రా ఆర్చర్, జోష్ టంగ్ ప్లేయింగ్ ఎలెవన్‌లో రావడంతో సాకిబ్ మహ్మూద్, ల్యూక్ వుడ్‌లపై వేటు పడింది. ఈ ఇద్దరి రాకతో ఇంగ్లండ్ బౌలింగ్ విభాగం మరింత బలపడింది. ఆర్చర్ రాకతో భారత బ్యాటర్లు అలర్ట్ కావాల్సిందే. టీమిండియా బ్యాటర్లపై పూర్తి అవగాహన ఉన్న అతడు రెచ్చిపోవడం ఖాయం. అలానే ఆర్చర్ బౌన్సర్లకు ఇప్పటికే బ్యాటర్లు గాయపడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బార్బొడాస్ పేసర్ బౌలింగ్‌లో ఆచితూచి ఆడి.. మిగతా బౌలర్లను టార్గెట్ చేస్తే పరుగులు సాధించవచ్చు. ఈ మ్యాచులో భారత యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ అరంగేట్రం చేస్తాడని తెలుస్తోంది. మొదటి బంతి నుంచే విరుచుకుపడే బుడ్డోడు కూడా ఆర్చర్ బౌలింగ్‌లో ఎలా ఆడుతాడన్నది ఇప్పుడు ఆసక్తిగా మారింది. వీరిద్దరు రాజస్థాన్ రాయల్స్ తరఫున ఆడుతున్న విషయం తెలిసిందే. తొలి టీ20లో టాస్ గెలిచిన భారత జట్టు ముందుగా బ్యాటింగ్ చేసింది. వైభవ్ సూర్యవంశీకి మరోసారి అవకాశం దక్కకపోగా.. అభిషేక్ శర్మ, సంజు శాంసన్‌లతోనే ఓపెనింగ్ కొనసాగించింది. అయితే ఆ నిర్ణయం ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేదు. సంజు కేవలం ఒక పరుగు మాత్రమే చేసి ఔటయ్యాడు. మరో ఓపెనర్ ఇషాన్ కిషన్ దురదృష్టకరమైన రనౌట్‌తో ఖాతా కూడా తెరవకుండానే పెవిలియన్ చేరాడు. ఈ క్లిష్ట సమయంలో అభిషేక్ తన దూకుడు బ్యాటింగ్‌తో ఇన్నింగ్స్‌ను గాడిలో పెట్టాడు. శ్రేయస్ అయ్యర్‌తో కలిసి వేగంగా పరుగులు సాధించిన అతడు 20 బంతుల్లోనే అర్ధశతకం పూర్తి చేశాడు. మొత్తం 24 బంతుల్లో 59 పరుగులు బాదాడు. అభిషేక్ ఔటైన తర్వాత అయ్యర్ బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. 47 బంతుల్లో 67 పరుగులు చేసి భారత ఇన్నింగ్స్‌కు అండగా నిలిచాడు. తిలక్ వర్మతో నాలుగో వికెట్‌కు 36 పరుగులు, శివమ్ దూబేతో ఐదో వికెట్‌కు 41 పరుగుల కీలక భాగస్వామ్యాలు నెలకొల్పాడు. చివర్లో శివమ్ దూబే మెరుపు ఇన్నింగ్స్ ఆడుతూ ఇంగ్లండ్ బౌలర్లపై ఎదురుదాడికి దిగాడు. కేవలం 21 బంతుల్లో అజేయంగా 42 పరుగులు చేసి.. మూడు సిక్సర్లు, రెండు ఫోర్లతో చెలరేగాడు. దీంతో భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 189 పరుగులు చేసింది. అయితే ఇంగ్లండ్ ఇన్నింగ్స్ ప్రారంభమైన తర్వాత వర్షం అంతరాయం కలిగించడంతో మ్యాచ్ కొనసాగడం సాధ్యపడలేదు. చివరకు అంపైర్లు మ్యాచ్‌ను రద్దు చేశారు. దీంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్ ప్రస్తుతం 0-0తో సమంగా కొనసాగుతోంది. రెండో టీ20లో విజయం సాధించిన జట్టు సిరీస్‌లో కీలక ఆధిక్యం సాధించనుంది.

**రెండో టీ20కి ఇంగ్లండ్ ప్లేయింగ్ ఎలెవన్:** ఫిల్ సాల్ట్, జోస్ బట్లర్, హ్యారీ బ్రూక్ (కెప్టెన్), జేకబ్ బెతెల్, టామ్ బాంటన్, సామ్ కరన్, విల్ జాక్స్, లియామ్ డాసన్, జోఫ్రా ఆర్చర్, ఆదిల్ రషీద్, జోష్ టంగ్.

# నల్గొండ నైట్స్ విజయం



టీజీ 20 లీగ్‌లో అనురాగ్ నల్గొండ నైట్స్ నాలుగో విజయాన్ని అందుకుంది. ఛేజింగ్‌లో గౌరవ్ రెడ్డి (101 నాటౌట్) చెలరేగడంతో.. శుక్రవారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో నల్గొండ 8 వికెట్ల తేడాతో మెదక్ ఫాల్కన్స్‌పై గెలిచింది. ముందుగా మెదక్ 20 ఓవర్లలో 180/4 స్కోరు చేసింది. విక్రమ్ నాయక్ (48 నాటౌట్), వరుణ్ యర్రం (44 నాటౌట్), రవితేజ (33), శ్రుంజిత్ రెడ్డి (30) రాణించారు. తర్వాత నల్గొండ 16.3 ఓవర్లలో 181/2 స్కోరు చేసింది. జశ్వత్ మోతే (34), నితీశ్ రెడ్డి (21), రాహుల్ బుద్ధి (20 నాటౌట్) మెరుగ్గా ఆడారు. గౌరవ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది.



# స్విట్జర్లాండ్ సరికొత్త రికార్డ్..

ఫిఫా ప్రపంచకప్ నాకౌట్ దశలో స్విట్జర్లాండ్ జట్టు సుదీర్ఘ కాలం తర్వాత సరికొత్త చరిత్ర సృష్టించింది. కెనడాలోని వాంకోవర్ వేదికగా జరిగిన హోరాహోరీ పోరులో స్విట్జర్లాండ్ 2-0 గోల్స్ తేడాతో అల్జీరియాను చిత్తు చేసింది. ఈ అద్భుత విజయంతో 1938 తర్వాత ప్రపంచకప్‌లో తమ మొట్టమొదటి నాకౌట్ విజయాన్ని నమోదు చేయడమే కాకుండా, వరుసగా నాలుగోసారి ప్రిక్వార్టర్ ఫైనల్స్ కు అర్హత సాధించి స్విస్ జట్టు సత్తా చాటింది.

**ఆరంభం నుంచే స్విస్ పంజా..**

మ్యాచ్ ప్రారంభమైన 10వ నిమిషంలోనే స్విట్జర్లాండ్ ఖాతా తెరిచింది. ఫ్రీబర్గ్ క్లబ్ యువ సంచలనం జోహన్ మంజంబీ అల్జీరియా డిఫెండర్లను ముప్పుతిప్పలు పెడుతూ అందించిన అద్భుతమైన అసిస్ట్‌ను స్ట్రైకర్ బ్రీల్ ఎంబోలో గోల్‌గా మలిచాడు. దీంతో స్విస్ జట్టు 1-0 ఆధిక్యంలోకి వెళ్లింది. ఆ తర్వాత రెండో హాఫ్ ప్రారంభమైన కేవలం 46 సెకన్లలోనే నాటింగ్హామ్ ఫారెస్ట్ వింగర్ డాన్ న్డోయ్ పెనాల్టీ ఏరియా లోపలి నుండి బంతిని నెట్‌లోకి పంపి స్విస్ ఆధిక్యాన్ని 2-0కి పెంచాడు. మరోవైపు ప్రపంచకప్ నాకౌట్‌లో తొలి విజయం కోసం ఆరాటపడ్డ అల్జీరియాకు స్విస్ డిఫెన్స్ ఛాన్స్ ఇవ్వలేదు. మొదటి హాఫ్‌లో అల్జీరియా ప్లేయర్ ఫారెస్ చైబీకి లభించిన ఒకే ఒక్క సువర్ణ అవకాశాన్ని స్విస్ గోల్ కీపర్ గ్రెగర్ కోబెల్ చాకచక్యంగా అడ్డుకున్నాడు.

**88 ఏళ్ల రికార్డు బద్దలు.. మంజంబీ మెరుపులు**

స్విట్జర్లాండ్ జట్టు ప్రపంచకప్ నాకౌట్ మ్యాచ్‌లో గెలవడం 1938 తర్వాత ఇదే తొలిసారి కావడం విశేషం. అలాగే 1954లో ఆస్ట్రియాతో జరిగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ తర్వాత, ఒక నాకౌట్ మ్యాచ్‌లో స్విస్ జట్టు ఒకటి కంటే ఎక్కువ గోల్స్ చేయడం కూడా ఇదే మొదటిసారి. ఈ మ్యాచ్‌లో స్విస్ కెప్టెన్ గ్రానిట్ షాకా తన 150వ అంతర్జాతీయ మ్యాచ్ ఆడి సరికొత్త మైలురాయిని అందుకోగా, అందరి దృష్టిని మాత్రం 20 ఏళ్ల యువ ఆటగాడు జోహన్ మంజంబీ ఆకర్షించాడు. అల్జీరియా డిఫెన్స్ లైన్‌ను ముక్కలు చేసిన ఈ యువ వింగర్ టోర్నమెంట్‌లో ఇప్పటివరకు 3 గోల్స్, 2 అసిస్ట్‌లతో మొత్తం 5 గోల్స్‌లో ప్రత్యక్ష భాగస్వామ్యం వహించాడు. 1966 తర్వాత ఒకే ప్రపంచకప్‌లో 5 గోల్స్ ఇన్వాల్వ్‌మెంట్ సాధించిన అతి పిన్న వయస్కుడైన స్విస్ ఆటగాడిగా మంజంబీ రికార్డు సృష్టించాడు. ఈ విజయంతో క్వార్టర్ ఫైనల్ రేసులోకి దూసుకెళ్లిన స్విట్జర్లాండ్.. జూలై 7న వాంకోవర్‌లోని బీసీ ప్లేస్ స్టేడియంలో జరగబోయే రౌండ్ ఆఫ్ 16 మ్యాచ్‌లో కొలంబియా లేదా ఘనా విజేతతో తలపడనుంది.

# టైమింగ్స్‌లో మార్పులు !




ఇండియా, ఇంగ్లాండ్ మధ్య నేడు రెండో టీ20 జరగనుంది. ఓల్డ్ ట్రాఫోర్డ్ వేదికగా ఇవాళ రాత్రి 7 గంటల సమయంలో ఈ మ్యాచ్ షురూ అవుతుంది. ఇంగ్లాండ్ తో తొలి టీ20 వర్షం కారణంగా రద్దు కావడంతో ఈ మ్యాచ్ పై ఫోకస్ చేసింది భారత్. అంతేకాదు ఈ మ్యాచ్ లో 15 ఏళ్ల కుర్రాడు వైభవ్ డెబ్యూ చేస్తాడని అంటున్నారు. ఈ మేరకు అతడు చేసిన పోస్ట్ వైరల్ గా మారింది. ఇక ఇక్కడి పిచ్ బౌలింగ్, బ్యాటింగ్ కు సమతూకంగా ఉంటుందని చెబుతున్నారు. మొదటి మ్యాచ్ తరహాలోనే ఈ మ్యాచ్ కు కూడా వర్షం విలన్ గా మారే ప్రమాదం గురించి ఉన్నట్లు సమాచారం. దీంతో ఫ్యాన్స్ టెన్షన్ పడుతున్నారు. వరుణ దేవుడు కరుణించాలని కోరుతున్నారు.

**భారత జట్టు అంచనా:** సంజూ శాంసన్ / వైభవ్, అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్ (w), శ్రేయాస్ అయ్యర్ (c), తిలక్ వర్మ, శివమ్ దూబే, హర్షిత్ రాణా, అక్షర్ పటేల్, అర్ష్‌దీప్ సింగ్, వరుణ్ చక్రవర్తి, ప్రిన్స్ యాదవ్.

**ఇంగ్లండ్ (ఆడే జట్టు):** ఫిలిప్ సాల్ట్, జోస్ బట్లర్ (w), హ్యారీ బ్రూక్(c), జాకబ్ బెథెల్, టామ్ బాంటన్, సామ్ కర్రన్, విల్ జాక్స్, లియామ్ డాసన్, ఆదిల్ రషీద్, జోఫ్రా ఆర్చర్, జోష్ టంగ్

# బిజినెస్




# వీకెండ్ తగ్గిన గోల్డ్ రేట్లు..

గడచిన రెండు రోజులుగా భారీగా పెరిగిన బంగారం, వెండి ధరలు ఒక్కసారిగా చల్లబడ్డాయి. అంతర్జాతీయంగా విశ్లేషకుల అంచనాలు, వడ్డీ రేట్ల పెంపుపై అనిశ్చితితో నిన్నటి వరకూ పసిడి పరుగులు జరిగినప్పటికీ మళ్లీ క్రమంగా తగ్గటం కొనుగోలుదారులకు ఊరటను కలిగిస్తోంది. వారాంతంలో షాపింగ్ చేద్దాం అనుకుంటున్న వాళ్లు ముందుగా తమ నగరంలో ధరలను పరిశీలించటం ముఖ్యం. జూలై 4న బంగారం రేట్లు తగ్గాయి. జూలై 3 కంటే గ్రాముకు 24 క్యారెట్ల బంగారం రేటు దేశవ్యాప్తంగా గ్రాముకు రూ.27 తగ్గింది. దీంతో హైదరాబాద్, వరంగల్, నిజాంబాద్, ఖమ్మం, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, కడప నగరాల్లో స్వచ్ఛమైన బంగారం రేటు రూ.14వేల 673గా కొనసాగుతోంది. ఈ నగరాల్లో 22 క్యారెట్ల బంగారం రేటు గ్రాముకు రూ.13వేల 450గా కొనసాగుతోంది. శనివారం రోజున వెండి రేట్ల విషయానికి వస్తే.. జూలై 4, 2026న దేశవ్యాప్తంగా స్థిరంగా కొనసాగుతోంది. దీంతో రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాలైన హైదరాబాద్, వరంగల్, నిజాంబాద్, ఖమ్మం, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, కడపలో కేజీ స్వచ్ఛమైన వెండి రేటు కేజీకి రూ.2లక్షల 60వేలుగా స్థిరంగానే ఉంది. అంటే గ్రాము దాదాపు రూ.260 దగ్గర ఉంది.

# ఆర్‌బీఐ తాజా గణాంకాలు

## విదేశీ మారక, బంగారు నిల్వలు భారీ పతనం..




భారతదేశ విదేశీ మారక నిల్వలు, బంగారు నిల్వలు గణనీయంగా తగ్గినట్లు భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) తాజా గణాంకాలు వెల్లడించాయి. జూన్ 26, 2026తో ముగిసిన వారంలో దేశ విదేశీ మారక నిల్వలు 5.654 బిలియన్ డాలర్లు తగ్గి 666.933 బిలియన్ డాలర్లకు చేరాయి. అంతకుముందు వారంలో మాత్రం విదేశీ మారక నిల్వలు 963 మిలియన్ డాలర్లు పెరిగి 672.587 బిలియన్ డాలర్లకు చేరిన విషయం తెలిసిందే. ఆర్‌బీఐ వివరాల ప్రకారం, విదేశీ మారక నిల్వల్లో ప్రధాన భాగమైన విదేశీ కరెన్సీ ఆస్తులు 150 మిలియన్ డాలర్లు తగ్గి 541.067 బిలియన్ డాలర్లకు చేరాయి. యూరో, పౌండ్, యెన్ వంటి అమెరికేతర కరెన్సీల మారకపు విలువల్లో వచ్చిన హెచ్చుతగ్గులు కూడా ఈ తగ్గుదలపై ప్రభావం చూపినట్లు పేర్కొంది. ఇక బంగారు నిల్వల్లో ఒకే వారంలో భారీ క్షీణత నమోదైంది. బంగారు నిల్వలు 5.394 బిలియన్ డాలర్లు తగ్గి 102.536 బిలియన్ డాలర్లకు చేరాయి. ఇదే కాలంలో స్పెషల్ డ్రాయింగ్ రైట్స్ విలువ 89 మిలియన్ డాలర్లు తగ్గి 18.558 బిలియన్ డాలర్లకు చేరగా, అంతర్జాతీయ ద్రవ్య నిధి వద్ద భారత రిజర్వ్ పొజిషన్ కూడా 21 మిలియన్ డాలర్లు తగ్గి 4.7772 బిలియన్ డాలర్లుగా నమోదైంది. గత ఫిబ్రవరి 27, 2026తో ముగిసిన వారంలో భారత విదేశీ మారక నిల్వలు 728.494 బిలియన్ డాలర్లతో రికార్డు స్థాయికి చేరుకున్నాయి. అయితే అనంతరం పశ్చిమ ఆసియాలో పెరిగిన భౌగోళిక ఉద్రిక్తతలు, అంతర్జాతీయ పరిణామాలు రూపాయిపై ఒత్తిడిని పెంచాయి. రూపాయి విలువను స్థిరీకరించేందుకు ఆర్‌బీఐ మార్కెట్‌లో డాలర్లను విక్రయించడం వంటి చర్యలు చేపట్టడంతో విదేశీ మారక నిల్వలు తగ్గినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. ఇదిలా ఉండగా, దేశంలో విదేశీ మారక వ్యయాన్ని తగ్గించేందుకు బంగారం దిగుమతులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంది. బంగారం కొనుగోళ్లను తగ్గించాలని ప్రజలకు విజ్ఞప్తి చేయడంతో పాటు దిగుమతి సుంకాలను కూడా పెంచింది. దీంతో బంగారం దిగుమతులు తగ్గి, బంగారు నిల్వలపై కూడా ప్రభావం పడినట్లు తెలుస్తోంది. ఆర్‌బీఐ విడుదల చేసిన తాజా గణాంకాలు దేశ విదేశీ మారక నిల్వల్లో తాత్కాలిక ఒత్తిడిని సూచిస్తున్నప్పటికీ, అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితులు, రూపాయి మారకపు విలువ, ప్రపంచ మార్కెట్ పరిణామాలు రానున్న రోజుల్లో ఈ నిల్వల దిశను నిర్ణయించే కీలక అంశాలుగా మారనున్నాయి.

# ఎయిర్ ఇండియా కీలక నిర్ణయం




ఇటీవల అంతర్జాతీయ మార్కెట్లో చమురు, జెట్ ఇంధన ధరలు తగ్గడంతో ఎయిర్ ఇండియా కీలక నిర్ణయం తీసుకుంది. ఉత్తర అమెరికా, ఆస్ట్రేలియా, యూరప్, యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే)కు వెళ్లే విమానాలపై విధిస్తున్న ఫ్యూయల్ సర్‌చార్జీలను తగ్గించింది. జూలై 1 నుంచి అమల్లోకి వచ్చిన కొత్త రేట్ల ప్రకారం ఉత్తర అమెరికా, ఆస్ట్రేలియా రూట్లలో టికెట్‌కు 280 డాలర్లుగా ఉన్న సర్‌చార్జీని 200 డాలర్లకు తగ్గించగా, యూరప్, యూకే రూట్లలో 205 డాలర్ల నుంచి 125 డాలర్లకు తగ్గించింది. అయితే ఈ మార్పు ఇతర అంతర్జాతీయ లేదా దేశీయ విమానాలకు వర్తించదని తెలుస్తోంది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరగడంతో జెట్ ఇంధన ధరలు భారీగా పెరిగిన నేపథ్యంలో ఎయిర్ ఇండియా ఈ ఏడాది ఏప్రిల్‌లో ఫ్యూయల్ సర్‌చార్జీలను ప్రవేశపెట్టింది. ఆ సమయంలో పెరిగిన ఇంధన వ్యయం, గగనతల పరిమితుల కారణంగా విమానాల నిర్వహణ ఖర్చులు గణనీయంగా పెరిగాయి. అయితే ఇటీవల చమురు ధరలు తగ్గడం, కొంత ఉపశమనం లభించడంతో ఈ సర్‌చార్జీలను తగ్గించినట్లు వెల్లడించింది. విమానయాన రంగంలో మొత్తం నిర్వహణ వ్యయంలో ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ (ఏటీఎఫ్) వాటా సుమారు 40-45 శాతం ఉండటంతో, ఇంధన ధరల్లో వచ్చే మార్పులు టికెట్ ధరలు, సర్‌చార్జీలపై నేరుగా ప్రభావం చూపుతుంటాయి.

# ఆకర్షిస్తున్న ఆషికా రంగనాథ్



మోస్ట్ బ్యూటిఫుల్ హీరోయిన్ అషిక రంగనాథ్ సినిమాల కంటే సోషల్ మీడియాలోనే ఎక్కువగా అభిమానులను అలరిస్తూ ఉంటుంది. తరచూ తన గ్లామరస్ ఫోటోషూట్లను సోషల్ మీడియాలో షేర్ చేస్తూ ఫ్యాన్స్‌ను ఆకట్టుకునే ఈ బ్యూటీ, మరోసారి తన స్టన్నింగ్ లుక్‌తో నెటిజన్ల దృష్టిని తనవైపు తిప్పుకుంది. తాజాగా అషిక రంగనాథ్ కి సంబంధించిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ ఫోటోల్లో ఆమె అద్భుతమైన ఎంబ్రాయిడరీ వర్క్‌తో అలంకరించిన పలుచటి చీరకు మ్యాచింగ్‌గా స్లీవ్‌లెస్ బ్లౌజ్ ధరించి ఎంతో ఎలిగెంట్‌గా కనిపించింది. మూడు వరుసల ఇయర్‌రింగ్స్, చేతి వేలికి స్టైలిష్ రింగ్ ధరించి తన లుక్‌కు మరింత అందాన్ని జోడించింది. ముఖంపైకి సున్నితంగా జారిన కురులతో వివిధ భంగిమల్లో కెమెరాకు పోజులిచ్చింది. మొత్తం మీద అషిక రంగనాథ్ ఈ లుక్‌లో మరింత అందంగా, ఆకర్షణీయంగా మెరిసిపోవడంతో ఆమె తాజా ఫోటోలు సోషల్ మీడియాలో భారీగా వైరల్ అవుతున్నాయి.




# యూట్యూబ్‌లోకి 'కన్నప్ప'...




మంచు విష్ణు హీరోగా తెరకెక్కిన కన్నప్ప సినిమా నుంచి బిగ్ అప్డేట్ వచ్చింది. ఈ సినిమా తాజాగా యూట్యూబ్ లోకి వచ్చేసింది. యూట్యూబ్ లో సినిమా ప్రియులు ఉచితంగానే చూసేందుకు మేకర్స్ ఈ అవకాశాన్ని కల్పిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఈ మూవీ రిలీజ్ ఏడాది పూర్తయిన సందర్భంగా, మొన్న రీ-రిలీజ్ కూడా చేసిన సంగతి తెలిసిందే. ఇక ఇప్పుడు ఉచితంగానే అందుబాటులోకి తీసుకురావడం గమనార్హం. మ-ంఖేష్ కుమార్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో మోహన్ బాబు, ప్రభాస్, కాజల్, అక్షయ్ కుమార్, మోహన్ లాల్ లాంటివాళ్లు కీలక పాత్రల్లో కనిపించారు. యూట్యూబ్ లోకి కన్నప్ప రావడంతో థియేటర్లలో మిస్ అయినవాళ్లు.. ఇప్పుడు తిలకించేందుకు ఆసక్తి చూపిస్తున్నారు.

# ఆ సమయంలో నరకం చూశాను..

"కొంతకాలం క్రితం మెట్లపై నుంచి జారి కింద పడిపోయాను. తలకు దెబ్బ తగలకుండా ఉండేందుకు పక్కకు పడటంతో నా పక్కటెముకలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. శరీరంలో రాడ్లు, స్క్రూలు అమర్చాల్సి వచ్చింది. డాక్టర్లు కొంతకాలం పూర్తిగా విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. ఆ సమయంలో నేను నాలుగు, ఐదు సినిమాల్లో నటిస్తున్నాను. కెరీర్ మంచి దశలో ఉన్న సమయంలో జరిగిన ఈ ప్రమాదం వల్ల సినిమాలకు దూరం కావాల్సి వచ్చింది. ఆ రోజులు నాకు నిజంగా నరకం లాంటివి. అయితే ఆ కష్టకాలాన్ని వృథా చేయకుండా పెయింటింగ్ చేయడం, పాటలు పాడటం, శిల్పకళ (స్కల్ప్టింగ్), పుస్తకాలు చదవడం, ప్రయాణాలు చేయడం వంటి పనులతో గడిపాను. అలాగే కుటుంబ సభ్యులు, స్నేహితులతో ఎక్కువ సమయం గడపడం వల్ల మానసికంగా, శారీరకంగా మరింత బలంగా మారాను" అని చెప్పుకొచ్చింది. ఇప్పటికే నభా నటేష్ మళ్లీ సినిమాల్లో రీ-ఎంట్రీ ఇచ్చి వరుస అవకాశాలను అందుకుంటోంది. తాజాగా ఆమె నటించిన 'నాగబంధం: ది సీక్రెట్ ట్రెజర్' చిత్రం నిన్న ప్రేక్షకుల ముందుకు వచ్చి ప్రస్తుతం థియేటర్లలో విజయవంతంగా ప్రదర్శించబడుతోంది.





# పవన్ ఫ్యాన్స్‌కు డబుల్ ట్రీట్?

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్, దర్శకుడు సుజీత్ కాంబినేషన్‌లో వచ్చిన 'ఓజీ' చిత్రం బాక్సాఫీస్ వద్ద పర్వాలేదనిపించింది. ముఖ్యంగా పవన్ కళ్యాణ్‌ను స్టైలిష్ గ్యాంగ్‌స్టర్‌గా చూపించిన తీరు, ఆయన స్క్రీన్ ప్రెజెన్స్, యాక్షన్ ఎపిసోడ్స్, మార్షల్ ఆర్ట్స్ సన్నివేశాలు మెగా అభిమానులకు ప్రత్యేక అనుభూతిని కలిగించాయి. ఎస్ఎస్ థమన్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, విజువల్స్ కూడా సినిమాకు ప్రధాన బలంగా నిలిచాయి. ఈ చిత్రానికి సీక్వెల్‌గా రానున్న 'ఓజీ 2'పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. తొలి భాగం సాధించిన విజయాన్ని మించేలా రెండో భాగాన్ని తెరకెక్కించేందుకు దర్శకుడు సుజీత్ ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్తున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. మొదటి భాగంలో పవన్ కళ్యాణ్ స్టైల్, హీరోయిజం, యాక్షన్ సన్నివేశాలకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వచ్చినప్పటికీ.. కథ అండ్ స్క్రీన్‌ప్లే విషయంలో మరింత బలంగా ఉండాల్సిందనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ముఖ్యంగా ఎమోషన్స్ పరంగా సినిమా ఇంకాస్త ప్రభావం చూపాల్సిందని కొందరు అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో 'ఓజీ 2'లో అలాంటి లోపాలు కనిపించకుండా.. డైరెక్టర్ సుజీత్ కథపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు సమాచారం. ప్రస్తుతం స్క్రిప్ట్ అభివృద్ధి పనులకే ఎక్కువ సమయం కేటాయిస్తూ.. ప్రతి సన్నివేశాన్ని ఒకటికి రెండుసార్లు పరిశీలిస్తున్నారని టాలీవుడ్‌లో టాక్ వినిపిస్తోంది.

# 'లెనిన్' కోసం ఇద్దరు స్టార్ హీరోలు..




అక్కినేని అఖిల్ హీరోగా 'వినరో భాగ్యము విష్ణు కథ' ఫేమ్ మురళీ కిషోర్ అబ్బూరు దర్శకత్వంలో తెరకెక్కిన 'లెనిన్' చిత్రం జూలై 10న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సినిమాలో భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటించగా, ఎస్.ఎస్. తమన్ సంగీతం అందించారు. అన్నపూర్ణ స్టూడియోస్, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై నాగార్జున అక్కినేని, సూర్యదేవర నాగ వంశీ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించారు. విడుదల తేదీ సమీపిస్తుండటంతో చిత్ర బృందం ఇప్పటికే జోరుగా ప్రమోషన్లు నిర్వహిస్తోంది. ఈ ప్రమోషన్లను మరింత గ్రాండ్‌గా నిర్వహించేలా మేకర్స్ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. ఇందులో భాగంగా టాలీవుడ్ స్టార్ హీరో జూనియర్ ఎన్టీఆర్‌తో ప్రత్యేక ఇంటర్వ్యూను ప్లాన్ చేసినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ ఇంటర్వ్యూలో నాగార్జున కూడా పాల్గొనే అవకాశముందని వార్తలు వినిపిస్తున్నాయి. అఖిల్, నాగార్జున, జూనియర్ ఎన్టీఆర్ ముగ్గురు కలిసి ఒకే వేదికపై కనిపిస్తే సినిమాపై అంచనాలు మరింత పెరిగే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అయితే, దీనిపై చిత్ర బృందం నుంచి ఇంకా అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. ప్రస్తుతం మాత్రం ఈ సినిమాపై ప్రేక్షకుల్లో మంచి అంచనాలు నెలకొన్నాయి.

Edited, Printed, Published & Owned by **KOMARAJU SRINIVASULU** and Printed at **Ramu Graphics**, Shop No:5,Near Clock Tower Church Compound, Nalgonda District (T.S.), Published From: KOMARAJU SRINIVASULU, Village: Anthaiah Gudem, Post: Duppalapally, Mandal: Thipparthy-508247, Dist. Nalgonda, (T.S) **Editor: KOMARAJU SRINIVASULU. Cell: 7730032999, E-mail: flashindiadaily@gmail.com, www.flashindianews.com, RNI No. APTEL/2010/33229**